# విడాకులు మరియు పునర్వివాహం

నిజమైన క్రైస్తవులలో తరచుగా విడాకులు, పునర్వివాహం అన్న అంశం చర్చనీయాంశం అవుతుంది. ఈ చర్చకు 1. దేవుని దృష్టిలో విడాకులు ఎప్పుడు లేక అసలు ఎప్పుడైనా అనుమతించదగినదేనా? 2. దేవుని దృష్టిలో ఎప్పుడు లేక ఎప్పుడైనా పునర్వివాహం అంగీకార యోగ్యమైనదా? అన్న ప్రధానమైన రెండు ప్రశ్నలు మూలాధారమైనవి. క్రైస్తవంలోని అనేక శాఖలు, స్వతంత్రమైన సంఘాలు ఏది అనుమతించ దగినది, ఏది కాదు అన్న విషయంలో లేఖనాలను గూర్చిన తమ తమ వివరణల ఆధారంగా కొన్ని సిద్ధాంతాలను ఏర్పరచుకొని అనుసరిస్తున్నారు. దేవుని పట్ల వారికి గల ప్రేమతో వారు వాటికి కట్టుబడి, వాటిననుసరించి జీవిస్తున్నందుకు వారిని మనం గౌరవించాలి. అయితే మనందరి నమ్మకాలు లేఖనాలకు నూరు శాతం కట్టుబడినవై ఒకటిగా వుంటే అవెంతో ఉత్తమమైనవిగా వుంటాయి. దేవుడు ఉద్దేశించిన వాటిలో ఏమి లోపమవుతాయో వాటిని శిష్యులుగా చేసే కాపరి బోధించడు. అలాగే దేవుడు చేయమని కోరని వాటిని చేయమని కూడా ఆయన ప్రజలకు చెప్పడు. దానిని లక్ష్యంగా పెట్టుకొని ఈ వివాదాస్పదమైన సమస్యను గూర్చి లేఖనం ఏమిచెబుతోందో నా శాయశక్తులా వివరిస్తున్నాను. దానితో మీరు ఏకీభవిస్తారో లేదో మీరే నిర్ణయించుకోండి.

నేడు ప్రపంచంలో విడాకులు ప్రబలుతున్నందుకు నేను కూడా మీలాగే చింతిస్తున్నాను. విడాకులు తీసుకొంటున్నారు అన్న దానికంటే క్రైస్తవులమని చెప్పుకొంటున్నవారు, పరిచర్యలో వున్నవారు కూడా విడాకులు యివ్వడం మరింత బాధాకరమైన విషయం. ఇంతకంటే మహా విషాదకరమైనది మరొకటి వుండదు. ఇది ఇంకా ఎక్కువ జరగకుండా ఆపాలంటే, సువార్తను ప్రజలకు ప్రకటించి, పశ్చాత్తాపడమని వారిని పిలవడమే దీనికి పరిష్కార మార్గం. వివాహం చేసుకొన్న దంపతులిద్దరూ తిరిగి జన్మించిన వారై ఆ ఇద్దరూ క్రీస్తును అనుసరించువారైతే వారెన్నటికీ విడాకులు తీసుకోరు. శిష్యులను చేసే పరిచారకుడు తన వైవాహికజీవితాన్ని బలమైనదిగా చేసుకొన్నప్పుడు అతని మాదిరి జీవితం తెలిసిన వారిపై అతని బోధ ప్రభావం చూపుతుంది.

నాకు వివాహమై ఇరవై అయిదు సంవత్సరాలైంది. విడాకులనే సమస్య నా ఊహలోకి కూడా ఎప్పుడూ రాలేదు. అందుకని విడాకులను గూర్చి వివరించే కఠినమైన లేఖన భాగాలను నాకు అనుకూలంగా అన్వయించుకోవాలన్న ఉద్దేశ్యం కూడా నాకు లేదు. విడాకులు తీసుకున్న వారిపట్ల నాకు ప్రగాఢమైన సానుభూతి వుంది. నేను కూడా విడాకులు తీసుకునే వాణ్నే. యౌవనస్థునిగా నాకు నేను తప్పు లేక చెడ్డ నిర్ణయం సులభంగా చేయగలనని, నన్ను వివాహం చేసుకొన్న ఆమె కంటే, సహనం తక్కువ వున్న ఆమెను విడాకులకు ప్రోత్సహించేట్లు శోధించగలనని తెలిసికూడా దేవుని కృపవల్ల నేనా పనిచేయలేదు. వివాహం చేసుకొన్న వారిలో

ఎక్కువ మంది నేను చెప్పిన దానికి సంబంధించిన వారే గనుక విడాకులు తీసుకొన్న వారిమీద రాళ్ళు రువ్వకుండా లేక సూటిపోటి మాటలనకుండా వుండాలి. ఆ విడాకులు తీసుకున్నవారు ఎంత సహించారో తెలియకుండానే వారికంటే అధమమైన వైవాహిక జీవితాలను గడుపుతూ, వారిని దూషించడానికి మనమెవరం? ఆ పరిస్థితుల్లో మనం వుంటే వారికంటే ముందే విడాకులు తీసుకొంటామని తెలిసిన దేవుడు మనకంటే వారిని నీతిమంతులుగా ఎంచవచ్చు.

పెండ్లి చివరికి విడాకులకే అని ఎవరూ వూహించరు. ఆ విడాకుల వలన బాధపడిన వారికంటే విడాకులను ద్వేషించి, అసహ్యించుకొనేవారు మరొకరుండరను కొంటాను నేను. కనుక వివాహం చేసుకొన్న వారిలో ఏవైనా బేదాభిప్రాయాలుంటే, వారు కలసివుండేట్లు, విడాకులు తీసుకున్న వారి విషయంలో దేవుని కృప ఏమిటో తెలుసుకొనేట్లు సహాయం చేయడానికి మనం ప్రయత్నించాలి. ఆ ఉద్దేశ్యంతోనే నేనిది వ్రాస్తున్నాను.

ఈ అంశం మీద వున్న లేఖన భాగాలు కనీసం కొంత భాగాన్ని అపార్థం చేసుకొన్నందు వల్లనే వారు ఇతర భాగాలను వ్యతిరేక అర్థంతో అర్థం చేసుకొంటున్నారని తెలిసిన నేను ఈ లేఖన భాగాలను మరికొన్ని లేఖన భాగాలతో వివరించడానికి ప్రయత్నిస్తున్నాను.

## పునాది

మనందరం ఒప్పుకొనే ప్రాధమిక సత్యంతో దీన్ని మనం ప్రారంభిద్దాం. దేవుడు విడాకులకు వ్యతిరేకి అని లేఖనం స్థిరంగా చెబుతోంది. ఇశ్రాయేలీయులలోని కొందరు పురుషులు వారి భార్యలకు విడాకులిస్తున్నప్పుడు మలాకీ అనే తన ప్రవక్త ద్వారా దేవుడు ఇలా ప్రకటించాడు:

> భార్యను పరిత్యజించుట నాకు అసహ్యమైన క్రియ యని ఇశ్రాయేలీయుల దేవుడగు యెహోవా సెలవిచ్చుచున్నాడు. మరియు ఒకడు తన వస్త్రములను బలాత్కారముతో నింపుట నా కసహ్యమని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చు చున్నాడు; కాబట్టి మీ మనస్సులను కాచుకొనుడి, విశ్వాసఘాతకులు కాకుడి (మలాకి 2:16).

దేవుని ప్రేమ పూరితమైన, న్యాయమైన గుణలక్షణాలు గలవాడని, విడాకులు భార్యాభర్తలకు, పిల్లలకు ఎంత నష్టం కష్టం కలిగిస్తుందో తెలిసిన వారెవరినీ పై ప్రవచనం ఆశ్చర్యపరచదు. విడాకులకు ఆనుకూల భావం గల వారెవరైనా అలాంటి వారి నైతిక ప్రవర్తనను ప్రశ్నించవచ్చు. దేవుడు ప్రేమామయుడు (1యోహాను 4:8 చూడండి) కనుక ఆయన విడాకులను అసహ్యించుకుంటాడు.

ఏ 'కారణం చేతనైనా' విడాకులు చట్టసమ్మతమైనదేనా అని కొందరు పరిసయ్యులు యేసును అడిగారు. విడాకులను గూర్చిన ఆయన అనంగీకారాన్ని ఆయన సమాధానం తెలియజేస్తుంది. వాస్తవానికి ఎవరూ ఎప్పుడూ విడాకులు తీసుకొనకూడదని ఆయన ఉద్దేశ్యం:

పరిసయ్యులు ఆయనను శోధింపవలెనని ఆయన యొద్దకు వచ్చి - ఏ హేతువు చేతనైనను పురుషుడు తన భార్యను విడనాడుట న్యాయమా? అని అడుగగా, ఆయన-సృజించిన

వాడు ఆదినుండి వారిని పురుషునిగాను స్త్రీని గాను సృజించెననియు, ఇందు నిమిత్తం పురుషుడు తల్లిదండ్రులను విడిచి తన భార్యను హత్తుకొనును, వారిద్దరును ఏకశరీరముగా ఉందురని చెప్పెననియు మీరు చదువలేదా? కాబట్టి వారికను ఇద్దరుకాక ఏకశరీరముగా ఉన్నారు గనుక దేవుడు జతపరచినవారిని మనుష్యుడు వేరుపరచకూడదని చెప్పెను (మత్తయి 19:3-6).

చరిత్రపరంగా చూస్తే, యేసు కాలంలో యూదా మత నాయకులలో సాంప్రదాయ వాదులు, ఉదారవాదులు అను రెండు తెగల వారుండేవారని మనకు తెలుసు. ఆ రెండు తెగల వారిని గూర్చి తర్వాత వివరంగా తెలుసుకుందాం. భార్యపట్ల తీవ్రమైన నైతిక కారణాల వల్లనే ఒక వ్యక్తి భార్యకు విడాకులు ఇవ్వాలి అని సాంప్రదాయుల వాదం. దీనికి భిన్నంగా ఒక పురుషుడు తన భార్యను ఏకారణం చేతనైనా చివరికి తన భార్యకంటే ఆకర్షణీయమైన మరో స్త్రీతో సంబంధం కలిగినా భార్యకు విడాకులివ్వవచ్చు అని అంటారు. పరిసయ్యులు యేసును ప్రశ్నించడానికి పరస్పర విరుద్ధమైన ఈ భిన్నాభిప్రాయాలే ఆధారం.

అందుకు జవాబుగా యేసు లేఖనంలోని ఆదికాండంలో దేవుడు మానవులను సృజించిన ఉద్దేశ్యాన్ని అనగా స్త్రీ పురుషులను తాత్కాలికంగా గాక శాశ్వతంగా ఒకటిగా వుండాలని సృజించాడు. వివాహాన్ని మనస్సునందుంచుకొనే దేవుడు స్త్రీ పురుషులను సృజించాడు. వారిద్దరీ ప్రధాన సంబంధానికి గుర్తు వివాహమే. వివాహం జరిగిన తరువాత వారికి వారి తల్లిదండ్రుల సంబంధం కంటే వారిద్దరి సంబంధం ఎక్కువైనదని, పురుషులు తమ తల్లిదండ్రులను విడిచి భార్యను హత్తుకొంటారని మోషే ప్రకటించాడు.

అంతేగాక భార్యభర్తల మధ్యవుండే శారీరక ఐక్యత వారిద్దరూ ఏకశరీరులన్న దేవుని నిర్ణయాన్ని తెలియజేస్తుంది. ఆ సంబంధం వలన కలిగే సంతానం తాత్కాలికమైనది గాక దేవుడు ఉద్దేశించిన వారి శాశ్వత ఐక్యతకు నిదర్శనం. యేసు ఆ పరిసయ్యులకు సమాధానం చెప్పిన ఆయన స్వరంలో అలాంటి ప్రశ్న వారడిగినందుకే ఆయనలోని నిరుత్సాహాన్ని నేను గమనించగలను. "ఏకారణం చేతనైనా" పురుషులు భార్యలకు విడాకులు యివ్వకూడదన్నది నిశ్చయముగా దేవుని ఉద్దేశ్యం.

ఎవరూ పాపం చేయకూడదన్నది దేవుని ఉద్దేశ్యం. అయితే మనమందరం పాపం చేస్తున్నాం. అయితే మనలను కనికరించిన ఆయన మనం పాపానికి దాసులం కాకుండా అనేక ఏర్పాట్లు చేసాడు. మనం చేకూడదని ఆయన ఉద్దేశించిన వాటిని మనం చేసిన తరువాత మనకాయన చెప్పాలనుకొన్నవి కొన్ని ఉన్నాయి. విడాకులివ్వకూడదని చెప్పిన దేవునికి లోబడినవారికి విడాకులు తప్పనిసరైనాయి. మొదటి విడాకుల కార్యానికి గాని, ఆ తర్వాత జరిగిన లక్షలాది విడాకులకు గాని దేవుడు ఆశ్చర్యపడలేదు కాని ఆ కార్యం పట్ల ఆయన తన ద్వేషాన్ని ప్రకటించడమే గాక, అదిచేసిన వారికి ఆయన కొన్ని హెచ్చరికలు చేసాడు.

## ప్రారంభంలో

దీని ఆధారం చేసుకొని విడాకులు వివాహాన్ని గూర్చి దేవుడేం చెప్పాడో మరింత వివరంగా పరిశోధించడానికి ప్రారంభిద్దాం. విడాకులు, వివాహాన్ని గూర్చి యేసు

ఇశ్రాయేలీయులతో చెప్పిన వివరణలు చాలా వివాదస్పదంగా ఉన్నాయి. కనుక కొన్ని వందల సం॥ల క్రితం ఈ అంశాన్ని గురించి దేవుడు ఇశ్రాయేలీయులకు చెప్పిన దాన్ని మొదట అధ్యాయనం చేస్తే ఇప్పటి మన సమస్యకు సహాయకరంగా వుంటుంది. దేవుడు మోషే ద్వారా చెప్పినది, యేసు ద్వారా చెప్పినది పరస్పర విరుద్ధమైనదైతే దేవుని చట్టం మారిందా! లేక మోషే చెప్పిన దాన్ని, యేసు చెప్పిన దాన్ని మనం అపార్థం చేసుకొని వివరించామో స్పష్టంగా తెలుసుకోగలుగుతాం. కాగా విడాకులు, వివాహాన్ని గూర్చి దేవుడు ఏం చెప్పాడో ఆ ఉద్దేశ్యంతో ప్రారంభిద్దాం.

అది రెండవ అధ్యాయములోని మాట ఆధారంగా యేసు విడాకులను గూర్చి చెప్పిన విషయాన్ని యిప్పటికే చెప్పాను. ఇప్పుడు ఆ ఆదికాండంలోని భాగాన్ని చదువుదాం:

తరువాత దేవుడైన యెహోవా తాను ఆదాము నుండి తీసిన ప్రక్కటెముకను స్త్రీనిగా నిర్మించి ఆమెను ఆదాము నొద్దకు తీసికొనివచ్చెను. అప్పుడు ఆదాము ఇట్లనెను-

నా యెముకలలో ఒక యెముక

నామాంసములో మాంసము

ఇది నరునిలోనుండి తీయబడెను గనుక నారి అనబడును.

కాబట్టి పురుషుడు తన తండ్రిని తన తల్లిని విడిచి భార్యను హత్తుకొనును, వారు ఏక శరీరమైయుందురు (ఆది 2:22-24).

దీనిలో వివాహానికి ప్రారంభం (మొదలు)వుంది. దేవుడు మొదటి పురుషుని నుండి మొదటి పురుషుని కొరకు స్త్రీని చేసి ఆయన తానే ఆమెను అతని దగ్గరకు తీసుకొని వచ్చాడు. యేసు మాటలలో "కాబట్టి వారికను ఇద్దరుకాక ఏకశరీరముగా ఉన్నారు గనుక దేవుడు జతపరచినవారిని మనుష్యుడు వేరుపరచకూడదని చెప్పెను." (మత్తయి 19:6). దేవుడు అభిషేకించిన ఈ మొదటి వివాహము ఆ తర్వాత వివాహాలన్నింటికీ ఒక పద్ధతిని ఏర్పరచింది. దేవుడు పురుషుల సంఖ్యకు సమానమైన స్త్రీల సంఖ్యను సృజించాడు. స్త్రీ పురుషుని, పురుషుడు స్త్రీని ఆకర్షించునట్లు దేవుడు వారిని సృజించాడు. కాగా దేవుడు ఇంకా ఎక్కువ సంఖ్యలో వివాహాలు ఏర్పాటు చేస్తునాడని చెప్పుకోవచ్చు. కనుక దేవుడు జతపరచిన వారిని ఏ మానవుడు వేరుపరచ కూడదని యేసు చెప్పాడు. భార్య భర్తలైనవారు వేర్వేరుగా జీవితం నడపడం దేవుని ఉద్దేశ్యం కాదు. వారొకరిపై ఒకరు ఆధారపడి కలసి జీవిస్తూ దీవెనలను పొందడానికి ప్రయత్నించాలి. దేవుడు స్పష్టంగా తెలియజేసిన ఈ విధానాన్ని మీరిన వారు పాపాన్ని చేసినట్లే. అలా విడాకులనేవి ఏ వివాహానికి దేవుడుద్దేశించనది కాదని బైబిలు రెండో అధ్యాయం నుండి స్థిరపరచబడింది.

## దేవుని నియమం హృదయములో వ్రాయబడింది

ఆదికాండం రెండో అధ్యాయం ఎన్నడూ చదవని వారికి కూడా విడాకులివ్వడం తప్పు అని సహజంగా తెలుసు. బైబిలు జ్ఞానం లేని అనేక విగ్రహాధిక సంస్కృతులలో కూడా వివాహం జీవితకాల అనుబంధమని తెలిసి జీవిస్తున్న సంగతి మనకు తెలుసని నేను జ్ఞాపకం

చేస్తున్నాను. పౌలు రోమీయులకు వ్రాసిన పత్రికలో యిలా వివరించాడు:

> ధర్మశాస్త్రము లేని అన్యజనులు స్వాభావికముగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలను చేసినయెడల వారు ధర్మశాస్త్రము లేనివారైనను, తమకు తామే ధర్మశాస్త్రమైనట్టున్నారు. అట్టివారి మనస్సాక్షి కూడా సాక్ష్యమిచ్చుచుండగను, వారి తలంపులు ఒక దానిమీద ఒకటి తప్పు మోపుచు లేక తప్పులేదని చెప్పుచుండగను, ధర్మశాస్త్రసారము తమ హృదయములయందు వ్రాయబడినట్టు చూపుచున్నారు (రోమా 2:14-15).

దేవుని నైతిక ధర్మశాస్త్రం ప్రతి వ్యక్తి హృదయము మీద వ్రాయబడింది. మనస్సాక్షి ద్వారా మాట్లాడే ఆ నైతిక ధర్మమే దేవుడు ఆదాము నుండి యేసు వరకు వున్న ఇశ్రాయేలీయులందరికి ఇచ్చిన ధర్మశాస్త్రం. విడాకులను గూర్చి ఆలోచించే ప్రతివ్యక్తీ తన మనస్సాక్షితో వ్యవహరించాలని విడాకుల విషయములో తన మనసాక్షిని జయించాలను కొన్న వ్యక్తి విడాకులకు ప్రత్యామ్నాయంగా మరో న్యాయాన్ని కనుగొనాలని తెలుసుకుంటాడు. ఒక న్యాయమైన కారణం లేకండా ఒకవ్యక్తి తన మనస్సాక్షిని అణచి వేసి విడాకులుయిస్తే తాను చేసింది తప్పని అతని మనస్సాక్షి అతణ్ణి గద్దిస్తూనే వుంటుంది.

మనకు తెలిసినంత వరకు మోషే ద్వారా దేవుడు ఇశ్రాయేలీయులకు ధర్మశాస్త్రం యిచ్చేంత వరకు అంటే క్రీ. పూ 1440 వరకు ఆదాము నుండి ఇరవై ఏడు తరాలు. అప్పటి వరకు ఇశ్రాయేలీయులతో సహా విడాకులు, వివాహాన్ని గూర్చి అందరికీ దేవుడు మనస్సాక్షి యిచ్చాడు. న్యాయంగా వ్యవహరించడానికి అది వారికి చాలని దేవుడు అనుకొన్నాడు. (ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి నిర్గమనం చేసేంతవరకు మోషే ఆదికాండం (2వ అధ్యాయం) వ్రాయలేదని జ్ఞాపకం వుంచుకోండి). మోషే ధర్మశాస్త్రాన్ని యివ్వక ముందున్న ఇరవై ఏడు తరాలలో నోవహు జలప్రళయ సమయాన్ని కలుపుకొని కొన్ని లక్షల వివాహాలు విడాకులతో అంతమైనాయి అని అనుకోవడంలో అసహజమేమీ లేదు. అంతేకాక విడాకులిచ్చి తమ పాపానికి పశ్చాత్తాప పడి క్షమాపణ వేడుకొన్నప్పుడు మారని దేవుడు వారిని క్షమించి వుంటాడనుకోవడంలోనూ అసహజమేమీ లేదు. మోషే ధర్మశాస్త్రం ఇవ్వక ముందు విశ్వాసం ద్వారా అబ్రాహాము రక్షించబడినట్టే, దేవుడు కొందరిని రక్షించి వుంటాడు, కొందరిని నీతి మంతులుగా తీర్చి వుంటాడు (రోమా 4:1-12). ఆదాము నుండి మోషే వరకు ప్రజలు తమ విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడ్డారంటే విడాకుల విషయములోనే కాక ప్రతి విధమైన పాపం నుండి క్షమాపణ పొందివుంటారు. అలా మనం విడాకులు, వివాహం అన్న అంశాన్ని పరిశోధిస్తూవుండగా - "***మోషే ధరశాస్త్రాన్ని యివ్వకముందు విడాకులిచ్చి పాపం చేసిన వారు, మనస్సాక్షి ద్వారా తమ తప్పు తెలుసుకొని క్షమాపణ వేడి దేవుని క్షమాపణ పొందిన వారు (అప్పటికి వ్రాత పూర్వకమైన ధర్మశాస్త్రం లేదు గనుక) మళ్లీ వివాహం చేసుకొంటే వారు నేరస్థులవుతారా?***" నేనుగా ఈ ప్రశ్న వేస్తున్నాను.

తాము పాపం చేయకుండా తమ భార్యలు లేక భర్తల స్వార్థం వలన విడాకులకు లోనైన వారి విషయం ఏమిటి? వారు పునర్వివాహం చేసుకోకుండా వారి మనస్సాక్షి వారిని నిరోధిస్తున్నదా? అది నాకు అసహజంగా అనిపిస్తోంది! ఒక భర్త మరో స్త్రీని కోరి తన భార్యకు విడాకులిస్తే పునర్వివాహం చేసుకొనే హక్కు ఆమెకు లేదు అని నిర్ణయించేది ఏది? ఆమె తప్పు లేకపోయినా ఆమెకు విడాకులిచ్చారు కదా!

## మోషే ధర్మశాస్త్రం

బైబిల్లోని మూడవ పుస్తకంలో (లేవీయుల కాండం) విడాకులు, వివాహాల గూర్చి ప్రత్యేకంగా వివరించబడినట్లు చూస్తాం. యాజకుడు విడాకులు పొందిన స్త్రీని వివాహం చేసుకొనకూడదన్న నియమం మోషే ధర్మశాస్త్రంలో వుంది:

> వారు జారస్త్రీనే గాని భ్రష్టురాలినేగాని పెండ్లిచేసికొనకూడదు, పెనిమిటి
> విడనాడిన స్త్రీని పెండ్లిచేసికొనకూడదు. ఏలయనగా యాజకుడు తన
> దేవునికి ప్రతిష్ఠితుడు (లేవీ 21:7)

యాజకుల విషయములో ఈ నియమం వుంది గాని ఇశ్రాయేలీయులలో సామాన్య పురుషుని విషయములో మోషే ధర్మ శాస్త్రం ఈ నియమాన్ని చెప్పలేదు. కాని అక్కడ వివరించిన వచనంలో 1. విడాకులు పొందిన ఇశ్రాయేలు స్త్రీలున్నారని, 2. అంతకు ముందు వివాహం చేసుకొని విడాకులు పొందిన స్త్రీలను యాజకులు కాని పురుషులు వివాహం చేసుకొనడం తప్పు అని దానిలో లేదు. పైన చెప్పుకున్న ధర్మశాస్త్రం యాజకులకు మరియు యాజకుని పెండ్లాడే విడాకులు తీసుకున్న స్త్రీలకు మాత్రమే వర్తిస్తుంది. విడాకులు పొందిన స్త్రీ యాజకుని కాక మరో సామాన్యుని చేసుకోవడంలో తప్పు లేదని ఆ నియమం తెలియజేస్తోంది. అలాగే యాజకుడు కాని వ్యక్తి విడాకులు పొందిన స్త్రీని వివాహం చేసుకొనడం తప్పు కాదని దాని వివరణ.

ప్రధాన యాజకుడు (క్రీస్తుకు సూచనగా వున్న వ్యక్తి) ఇతర యాజకులకంటే ఉన్నత ప్రమాణాలతో జీవించాలి. అతను విధవను కూడా వివాహం చేసుకొనకూడదు. దీని విషయం లేవీయకాండంలో ఇలా చదువుతాం:

> విధవరాలినైనను విడవబడినదానినైనను, భ్రష్టురాలినైనను, అనగా
> జార స్త్రీనైనను అట్టివారిని పెండ్లి చేసికొనక తన ప్రజలలోని కన్యకనే
> పెండ్లిచేసికొనవలెను (లేవీ 21:14).

ఇశ్రాయేలీయులలో విధవలు పునర్వివాహము చేసుకొనటం కాని లేక ఇశ్రాయేలీయుల పురుషులు విధవలను వివాహమాడటం కాని పాపమని ఈ వచనం నిరూపిస్తోందా?లేదు. అది ఎట్టి పరిస్థితుల్లోనూ నిరూపించడం లేదు. కాని ప్రధానయాజకుడు తప్ప ఏవ్యక్తి విధవను చేసుకోవడం పాపం కాదని, ప్రధానయాజకుడు కాక సామాన్య పురుషుడు విధవను చేసుకొనవచ్చు నన్న బలమైన భావం ఆ వచనంలో వుంది. విధవలు పునర్వివాహం

చేసుకొనడం సమంజసమేనని ఇతర లేఖనభాగాలు స్థిరపరుస్తున్నాయి (రోమా 7:2-3; 1 తిమోతి 5:14).

లేవీ 21:7లో మనం చూసిన వచనంతో బాటు ఈ వచనంలో ఇశ్రాయేలీయులులో ఏ పురుషుడైన (అతడు యాజకుడు, ప్రధాన యాజకుడు కాకుంటే) విడాకులు తీసుకున్న స్త్రీని లేక కన్యకాని స్త్రీని "వ్యభిచారము వలన అపవిత్రురాలైన స్త్రీని" వివాహం చేసుకొనడంలో తప్పు లేదన్న భావం ఈ వచనంలో చూస్తాం. అంతేకాక విడాకులు పొందిన స్త్రీ, లేక "వ్యభిచారము వలన అపవిత్రురాలైన స్త్రీ" యాజకుని గాక సామాన్య వ్యక్తిని వివాహం చేసుకోవడం తప్పుకాదని మోషే ధర్మశాస్త్రం లోని భావం. వ్యభిచారాన్ని మరియు విడాకులను దేవుడు వ్యతిరేకిస్తున్నా ఆయన కృపలో వారికి మరొక అవకాశం ఇచ్చాడు.

## పునర్వివాహాన్ని గూర్చిన రెండవ స్పష్టమైన నిషేధం

విడాకులు పొందిన స్త్రీ పునర్వివాహానికి దేవుడు ఎన్ని అవకాశాలిస్తాడు? విడాకులు పొందిన స్త్రీలకు మోషే ధర్మశాస్త్రం ప్రకారం ఒక్క పునర్వివాహాన్నే దేవుడు అనుమతిస్తాడని మనం అనుకొంటే అది తప్పుడు అవగాహన. మోషే ధర్మశాస్త్రంలోని తర్వాత భాగాన్ని చూద్దాం:

> ఒకడు స్త్రీని పరిగ్రహించి ఆమెను పెండ్లిచేసికొనిన తరువాత ఆమెయందు మానభంగసూచన ఏదో ఒకటి అతనికి కనబడినందున ఆమెమీద అతనికి ఇష్టము తప్పినయెడల, అతడు ఆమెకు పరిత్యాగ పత్రము వ్రాయించి ఆమె చేతికిచ్చి తన యింటనుండి ఆమెను పంపివేయవలెను. ఆమె అతని యింటనుండి వెళ్ళిన తరువాత ఆమె వేరొక పురుషుని పెండ్లిచేసికొనవచ్చును. ఆ రెండవ పురుషుడు ఆమెను ఒల్లక ఆమెకు పరిత్యాగ పత్రము వ్రాయించి ఆమె చేతికిచ్చి తన యింటనుండి ఆమెను పంపివేసినయెడల నేమి, ఆమెను పెండ్లిచేసికొనిన పిమ్మట ఆ రెండవ పురుషుడు చనిపోయినయెడల నేమి ఆమెను పంపి వేసిన ఆమె మొదటి పెనిమిటి ఆమెను పెండ్లిచేసికొనుటకై ఆమెను మరల పరిగ్రహింపకూడదు. ఏలయనగా ఆమె తన్ను అపవిత్రపరచుకొనెను, అది యెహోవా సన్నిధిని హేయము గనుక నీ దేవుడైన యెహోవా నీకు స్వాస్థ్యముగా ఇచ్చుచున్న దేశమునకు పాపము కలుడకుండునట్లు మీరు అలాగు చేయకూడదు (ద్వితీ 24:1-4).

ఈ వచనం బట్టి రెండుసార్లు విడాకులు పొందిన స్త్రీ (లేక ఒకసారి విడాకులు పొంది, ఒకసారి విధవయైన స్త్రీ) ఆమె మొదటి భర్తను మళ్ళీ వివాహం చేసుకొనకూడదు. ఒకస్త్రీ రెండవ సారి విడాకులు పొందితే లేక (రెండో భర్త చనిపోయి విధవరాలైతే) ఆమె మొదటి భర్తను వివాహమాడకూడదు. కాని ***మరో వ్యక్తిని*** పునర్వివాహం చేసుకొనవచ్చునన్న భావం స్పష్టంగా దానిలో వుంది (అంటే అలాంటి ఆమెను వివాహంచేసుకోవడానికి ఇష్టపడే

వ్యక్తిని చేసుకొనవచ్చును). మొదటి భర్తను గాక మరొకరిని మళ్ళీ వివాహం చేసుకోడం ఆమెపట్ల పాపమైతే యిలాంటి వివరమైన హెచ్చరిక చేయాల్సిన అవసరం దేవునికి వుండేదికాదు. ఆయన చెప్పేదల్లా, "విడాకులు పొందిన వారు పునర్వివాహం చేసుకొన కూడదు" అనే.

అలాంటి స్త్రీ రెండోసారి వివాహం చేసుకొంటే ఆమె మొదటిసారి విడాకులు తీసుకొన్న తర్వాత ఆమెను వివాహమాడిన వ్యక్తి కూడా నేరస్థుడు కాడు. ఒకవేళ ఆమె మూడోసారి వివాహం చేసుకొంటే రెండుసార్లు విడాకులు పొందిన ఆమెను చేసుకున్న వ్యక్తి పాపం చేసినట్లు కాదు (అతడు మొదటి భర్త కాకుండా వుంటేనే). విడాకుల పద్ధతిని ద్వేషించే దేవుడు విడాకులు పొందిన వారిని ప్రేమిస్తున్నాడు. ఆయన కృపలో వారికి మరో అవకాశం ఇస్తున్నాడు.

## సారాంశం

ఇప్పటి వరకు మనం తెలుసుకొన్న దాని సారాంశాన్ని చెప్పుకుందాం: విడాకుల పట్ల ***దేవుడు తన ద్వేషాన్ని ప్రకటించినా తన పాత నిబంధనకు ముందుగాని, ఆ తర్వాత గాని 1. రెండుసార్లు విడాకులు పొందిన, లేక ఒకసారి విడాకులు పొందినా, లేక ఒకసారి విధవరాలైన స్త్రీ మళ్ళీ తన మొదటి భర్తను పునర్వివాహం చేసుకొనడం, 2. విడాకులు పొందిన స్త్రీ యాజకుని పునర్వివాహం చేసుకొనడం, తప్ప మరోవిధంగా పునర్వివాహం చేసుకొనడం పాపం అని దేవుడు చెప్పలేదు. అంతేగాక యాజకుడు తప్ప మరో వ్యక్తి విడాకులు పొందిన స్త్రీని వివాహం చేసుకొనడం పాపం అని దేవుడు ఎలాంటి సూచన చేయలేదు.***

ఇది - విడాకులు పొందిన వారు పునర్వివాహం చేసుకోవడాన్ని గూర్చి, విడాకులు పొందిన వారిని పెండ్లి చేసుకొన్న వారిని గూర్చి యేసు చెప్పిన దానికి వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. అలాంటి వారు వ్యభిచారం చేస్తునట్టే అని యేసు చెప్పాడు (మత్తయి 5:32 చూడండి). కనుక మనం మోషేను లేక యేసును అపార్థం చేసుకొన్నామా లేక దేవుడు తన ధర్మశాస్త్రాన్ని మార్చుకొన్నాడా! పదిహేను వందల సం॥లు ఇశ్రాయేలీయులకు అంగీకారమైన దేవుడిచ్చిన ధర్మశాస్త్రాన్ని యేసు నైతికంగా పాప మని హఠాత్తుగా ప్రకటించడం వింతగా వుంది. కనుక యేసు చెప్పిన దాన్ని మనం తప్పుగా వివరిస్తున్నామేమో నన్న అనుమానం నాకు వుంది.

ఈ వ్యతిరేక అభిప్రాయాన్ని పూర్తిగా పరిశీలించక ముందు పాత నిబంధనలో పునర్వివాహానికి, విడాకులు ఇవ్వడానికి ఎలాంటి ఆటంకం లేక దేవుని అనుమతి వుంది. కొన్ని న్యాయమైన కారణాలలో తప్ప విడాకులు పొందిన వారు పునర్వివాహానికి అయోగ్యులని దేవుడు చెప్పలేదు. కొందరి విడాకులు న్యాయసమ్మతముగా లేకపోవటం మూలానా వారు పునర్వివాహానికి అనర్హులు అని దేవుడు ఎప్పుడూ చెప్పలేదు. కొందరి విడాకులు న్యాయసమ్మతమైనవి కావటంచేత వారు పునర్వివాహానికి అర్హులు అని కూడా దేవుడు ఎప్పుడూ చెప్పలేదు. ఆయన ఏకపక్ష సాక్ష్యం విని కొందరు ఆధునిక పరిచారకులు తీర్పు లివ్వడానికి ప్రయత్నిస్తుంటారు. ఉదాహరణకు విడాకులు పొందిన ఒక స్త్రీ విడాకులకు తాను కారణం

కాదు, భర్త విడాకులిచ్చాడే కాని తాను కాదు గనుక పునర్వివాహం చేసుకోవడానికి తాను అర్హురాలనని తన సంఘకాపరిని ఒప్పించడానికి ప్రయత్నిస్తుంది. ఆసంఘ కాపరి విడాకులిచ్చిన ఆమె భర్తతో మాట్లాడితే అతడు ఆమెకు వ్యతిరేకంగా చెప్పిన దాన్నిబట్టి అతనిపై ఆ సంఘ కాపరికి సానుభూతి ఏర్పడవచ్చు. ఆమె మంచిదైనప్పటికీ ఆమె మీద నిందలు వచ్చే అవకాశం వుంది.

నాకు తెలిసిన ఒక దంపతులు ఉన్నారు. వారు విడాకులకు ధరకాస్తు పెట్టాలన్న అపవాదు తన మీదికి రాకుండా వుండేటట్లు మరొకరు ఆ విడాకులకు ప్రయత్నించాలన్నట్టు ఒకరి నొకరు విసిగిపోయేటట్లు ప్రేరేపించే విధంగా పోట్లాడుకునేవారు. వారి విడాకుల తర్వాత ఆ విడాకులకు కారణం నేను కాదంటే నేను కాదని ఒకరి మీద ఒకరు నెపం వేసుకుంటూ తాము పునర్వివాహానికి అర్హులమని చెప్పుకునేవారు.మనం ప్రజలను అవివేకులం చేయవచ్చునేమో కాని దేవుణ్ని చేయలేం. ఉదాహరణకు దేవుని వాక్యానికి అవిధేయురాలై తన భర్తతో శారీరక సంబంధం విషయంలో సహకరించక పోయినందువలన అతడు మరొక స్త్రీతో సంబంధం పెట్టుకొన్నందు వలన భర్తకు విడాకులిచ్చిన స్త్రీ పట్ల దేవుని చిత్తం ఎలా వుంటుంది? వారిద్దరూ విడాకులు తీసుకోవటంలో ఆమె పాత్ర లేదా?

ద్వితీయోపదేశకాండం 24వ అధ్యాయంలో చెప్పినట్టుగా రెండుసార్లు విడాకులు పొందిన స్త్రీని గూర్చి ఆ లేఖన భాగం ఆ రెండు విడాకులు న్యాయసమ్మతమైనవో కాదో ఏమీ చెప్పడం లేదు. ఆమె మొదటి భర్త ఆమెలో "తనపట్ల అవిశ్వాసంతో ప్రవర్తించడం" తెలుసు కొని వుండవచ్చు. ఆ అవిశ్వాసం "వ్యభిచారం" అయితే మోషే ధర్మశాస్త్రం ప్రకారం ఆమెను రాళ్ళతో కొట్టి చంపాలి (లేవీ 20:10 చూడండి). వ్యభిచార నేరమొక్కటే విడాకు లివ్వడానికి న్యాయసమ్మతమైన కారణమైతే ఆమె మొదటి భర్త ఆమెకు విడాకు లివ్వడానికి అంతకంటే మంచి కారణం దొరికివుండదు. మరోపక్క బహుశా ఆమె వ్యభిచార నేరం చేసివుంటే ఆమె భర్త, మరియ భర్తయైన యేసేపులా, "ఆమెను రహస్యంగా విడనాడటానికి కోరుకోవచ్చు" (మత్తయి 1:19). విడాకులుయివ్వడానికి అనుకూలమైన అనేక కథలు చెప్పవచ్చు.

ఆమె రెండో భర్త ఆమెపై కారణాలేమి చెప్పక, "ఆమెకు వ్యతిరేకయ్యాడు" అని చెప్పబడింది. ఎవరిని నిందించాలో మనకు తెలియదు. వారిద్దరూ ఒప్పుకొన్న పెద్ద భేదమేమీ వుండదు. కాని రెండు సార్లు విడాకులు పొందిన ఆమె మొదటి భర్తను తప్ప మరో వివాహం చేసుకోవడానికి ఆమె పట్ల తన కృపను చూపాడు దేవుడు.

## ఒక అభ్యంతరము

"ఏ కారణము చేతనైనా విడాకులు పొందిన వారు మళ్ళీ వివాహం చేసుకోవడం న్యాయమే అని ప్రజలు ఒకవేళ చెబితే, న్యాయసమ్మతం కాని కారణాలకు విడాకులు ఇచ్చేలా అది ప్రోత్సహిస్తుంది," అని తరచూ చెప్పబడుతోంది. నిజంగా దేవుని సంతృప్తి పరచడానికి ప్రయత్నించని కొందరు మతస్థులు అలా అడగగలరని నేననుకుంటాను. అయితే పాపం చేస్తూ దేవునికి విధేయులు కాని వారిని అవి చేయకుండా ఆపడానికి ప్రయత్నించడం

నిరుపయోగమే అవుతుంది. ఎవరైతే హృదయపూర్వకంగా దేవునికి విధేయులుగా వుండాలని కోరుకుంటారో వారు పాపం చేయాలని అనుకోరు. వారు ఎప్పుడూ దేవుని సంతృప్తి పరచడానికే ప్రయత్నిస్తుంటారు. అలాంటి వారి వైవాహిక బంధం బలంగా వుంటుంది. పాత నిబంధన ప్రకారం పునర్వివాహాన్ని గూర్చి దేవుడు ఇశ్రాయేలీయులకు ఉదారమైన ధర్మశాస్త్రాన్ని ఇచ్చాడు. కనుక ఆ నిబంధన ప్రకారం ఆయన అసమ్మతమైన విడాకుల విషయంలో అంతగా పట్టించుకోడు.

దేవుడు ఏ పాపాన్నైనా క్షమిస్తాడు అని మనం చెబితే ఒకవేళ ఆయన క్షమిస్తాడు కదా అని వారు మళ్ళీ పాపం చేయడానికి ప్రోత్సహించినట్లవుతుంది కనుక దేవుడు ఏ పాపాన్నైనా క్షమిస్తాడని మనం చెప్పకుండా వుందామా? అదే నిజమైతే మనం సువార్తను బోధించడం మానివేయాల్సి వస్తుంది. కనుక అది మళ్ళీ ప్రజల హృదయ స్థితిని దిగజారుస్తుంది. దేవుని ప్రేమించు వారు ఆయనకు విధేయులు కావాలని కోరుకొంటారు. నేనే పాపం చేసినా, క్షమించమని దేవుణ్ని అడిగితే ఆయన క్షమాపణ లభిస్తుందని నాకు తెలుసు. అలా అని అది నన్ను పాపం చేసేలా ప్రోత్సహించదు, ఎందుకంటే నేను దేవున్ని ప్రేమిస్తున్నాను, తిరిగి జన్మించాను. దేవుని కృప నన్ను మార్చివేసింది. నేను ఆయన్ను సంతోష పెట్టాలనుకుంటున్నాను.

ప్రజలు విడాకులు పుచ్చుకొని పునర్వివాహం చేసుకొనకుండా చేయడానికి, యిప్పుడున్న తప్పించలేని వ్యతిరేక పరిస్థితులకు అలాంటి మరో వ్యతిరేక పరిస్థితిని జోడించాల్సిన అవసరం లేదని దేవునికి తెలుసు. వైవాహిక జీవితంలో కష్టాలున్న వారికి మళ్ళీ వివాహం చేసుకొనే అనుమతి లేదు గనుక విడాకులు తీసుకోకుండా వుండడం మంచిదని వారితో చెప్పడం వలన పెద్ద ప్రయోజనం వుండదు. ఒకవేళ అతడు నీ మాటలు నమ్మినా ఎడతెగని అసమ్మతి వున్న వైవాహిక జీవితం కంటే ఒంటరి జీవితం అతనికి స్వర్గంలా అనిపించవచ్చు.

## పునర్వివాహంపై పౌలు అభిప్రాయం

పునర్వివాహాన్ని గూర్చి యేసు చెప్పిన దానిని, మోషే చెప్పిన దానితో పొందిక పరచడానికి ప్రయత్నించక ముందు మోషే చెప్పిన మాటలతో పొందిక పరచిన అపొస్తలుడైన పౌలు చెప్పినదానిని మనం పరిశీలించాలి. మోషే ధర్మశాస్త్రం చెప్పినట్టే, విడాకులు పొందిన వారు పునర్వివాహం చేసుకోవడం పాపం కాదు అని చెప్పాడు.

> కన్యకల విషయమై, ప్రభువు యొక్క ఆజ్ఞ నేను పొందలేదు గాని నమ్మకమైనవాడనై యుండుటకు ప్రభువు వలన కనికరము పొందినవాడనై నా తాత్పర్యము చెప్పుచున్నాను. ఇప్పటి ఇబ్బందినిబట్టి పురుషుడు తానున్న స్థితిలోనే యుండుట మేలని తలంచుచున్నాను. భార్యకు బద్ధుడవై యుంటివా? విడుదల కోరవద్దు. భార్యలేక విడిగానుంటివా వివాహము కోరవద్దు. అయినను నీవు పెండ్లిచేసికొనినను పాపము లేదు, కన్యక పెండ్లిచేసి కొనినను ఆమెకు పాపము లేదు, అయితే అట్టివారికి శరీరసంబంధమైన శ్రమలు

కలుగును, అవి మీకు కలుగకుండవలెనని కోరుచున్నాను (1కొరింథీ 7:25-28).

ఈ లేఖనభాగంలో పౌలు విడాకులు పొందిన వారినుద్దేశించి వ్రాస్తున్నాడనడంలో సందేహం లేదు. ఆయన వివాహమైన వారికి, వివాహం కాని వారికి, ఆరోజుల్లో క్రైస్తవులు హింసించబడుతున్నారు కనుక విడాకులు పొందిన వారు అదేస్థితిలో (మళ్ళీ వివాహం చేసుకొనకుండా) వుండాలని సలహా చెబుతున్నాడు. అయినప్పటికీ విడాకులు పొందినవారు, కన్యకలు ఒకవేళ వివాహం చేసుకొంటే వారు పాపం చేసినట్టు కాదని ఆయన స్పష్టంగా చెబుతున్నాడు.

విడాకులు పొందిన వారికి పునర్వివాహం చట్టసమ్మతమైనదే అని చెప్పడం లేదు. విడాకులు పొందిన వ్యక్తి అంతకు ముందు విడాకులు పొందడంలో నిరపరాధి అయితేనే పునర్వివాహాన్ని చేసుకొనవచ్చునని కూడా ఆయన చెప్పడం లేదు. (అలాంటి తీర్పు తీర్చడానికి దేవుడు తప్ప యోగ్యత గలవారెవరున్నారు?). తమ రక్షణకు ముందు విడాకులు పొందిన వారు మాత్రమే పునర్వివాహానికి అర్హులని కూడా ఆయన చెప్పడం లేదు. కాని విడాకులు పొందిన వారికి పునర్వివాహం పాపం కాదు అని మాత్రమే ఆయన చెప్పాడు.

## విడాకులకు పౌలు అనుకూలుడా?

పునర్వివాహం పట్ల పౌలు అనుకూలంగా వున్నాడు గనుక విడాకులు తీసుకోవటం విషయంలో ఆయన సమ్మతం తెలియజేస్తున్నాడా? లేదు, విడాకులకు పౌలు వ్యతిరేకన్నది స్పష్టం. కొరింథీయులకు ఆయన వ్రాసిన మొదటి పత్రికలో యింతకు ముందు చెప్పుకొన్నట్లు యిదే అధ్యాయంలో విడాకులను దేవుడు ద్వేషిస్తాడన్న విషయంలో పొత్తుగల చట్టాన్ని వివరించాడు.

మరియు పెండ్లియైన వారికి నేను కాదు ప్రభువే ఆజ్ఞాపించునదేమనగా, భార్య భర్తను ఎడబాయకూడదు. ఎడబాసినయెడల పెండ్లిచేసికొనకుండవలెను; లేదా, తన భర్తతో సమాధాన పడవలెను. మరియు భర్త తన భార్యను పరిత్యజింప కూడదు. ప్రభువు కాదు నేనే తక్కినవారితో చెప్పున దేమనగా-ఏ సహోదరునికైనను అవిశ్వాసురాలైన భార్యయుండి, ఆమె అతనితో కాపురము చేయ నిష్టపడినయెడల, అతడు ఆమెను పరిత్యజింపకూడదు. మరియు ఏ స్త్రీకైనను అవిశ్వాసియైన భర్తయుండి, ఆమెతో కాపురము చేయ నిష్టపడినయెడల, ఆమె అతని పరిత్యజింపకూడదు. అవిశ్వాసియైన భర్త భార్యనుబట్టి పరిశుద్ధపరచబడును, అట్టి సందర్భములో సహోదరునికైనను సహోదరికైనను నిర్బంధము లేదు. సమాధానముగా ఉండుటకు దేవుడు మనలను పిలిచియున్నాడు. ఓ స్త్రీ, నీ భర్తను రక్షించెదవో లేదో నీకేమి తెలియును? ఓ పురుషుడా, నీ భార్యను రక్షించెదవో లేదో నీకేమి తెలియును? అయితే ప్రభువు ప్రతివానికి ఏ స్థితి నియమించెనో, దేవుడు ప్రతివానిని ఏస్థితియందు పిలిచెనో, ఆ స్థితియందే నడుచుకొనవలెను. ఈ ప్రకారమే సంఘములన్నిటిలో నియమించుచున్నాను (1కొరింథీ 7:10-17).

విశ్వాసులై వుండి విశ్వాసులను వివాహం చేసుకొన్న వారిని పౌలు మొదట ఉద్దేశించి

చెప్పడం గమనించండి. వారు విడాకులు తీసుకొన కూడదని చెప్పాడు. ఇది తన మాట గాక దేవుని ఉపదేశమని కూడా చెప్పాడు. ఈ మాట యిప్పటి వరకు మనం బైబిలులో పరిశీలించిన వాటన్నిటితోను ఏకీభవిస్తుంది.

పౌలు చెప్పిన ఈ మాటలో ఆసక్తి కరమైన విషయం వుంది. విశ్వాసులైన వారు కూడా చాలా అరుదైన సందర్భాలలో విడాకులు తీసుకొనే అవకాశముందన్న సత్యాన్ని పౌలు గ్రహించాడని తేటగా తెలుస్తోంది. ఒకవేళ విశ్వాసులలో విడాకులు తీసుకోవడం జరిగితే విడాకులిచ్చిన భార్యగాని, భర్తగాని మళ్ళీ వివాహం చేసుకొనకుండా వుండాలని లేకుంటే వారు తమ భాగస్వామితో సమాధాన పడాలని పౌలు చెప్పాడు (పౌలు ఈ ఉపదేశాన్ని ప్రత్యేకంగా భార్యలైన వారికి చెప్పినా, ఇదే సిద్ధాంతం భర్తలకూ అన్వయిస్తుందని నేననుకుంటున్నాను).

పౌలు వ్రాస్తున్న అంశం మనకు ఆశ్చర్యాన్ని కలిగించదు. ఆయన మొదట విడాకులను గూర్చిన దేవుని నియమాన్ని చెప్పాడు. అయినా, దేవుని నియమానికి ఎప్పుడూ విధేయులు కారని కూడా ఆయనకు తెలుసు. కనుక ఇద్దరు విశ్వాసుల మధ్య విడాకులనే పాపం జరిగినప్పుడు ఏం చేయాలో పౌలు ఇలా వివరించాడు. తన భాగస్వామికి విడాకులిచ్చిన వారు మళ్ళీ వివాహం చేసుకొనకుండా వుండాలి లేదా వారితో సమాధాన పడాలి అని చెప్పాడు. విశ్వాసులైన వారు అలా చేయడం ఉత్తమమైన పద్ధతి. విడాకులు తీసుకొన్న ఆ యిద్దరూ పునర్వివాహం చేసుకొనకుండా వున్నంత కాలం, వారు సమాధానపడే అవకాశానికి వీలుంటుంది. అది మంచి పద్ధతి కూడా. వారిలో ఏ ఒక్కరూ పునర్వివాహం చేసుకున్న వారు సమాధాన పడతారన్న ఆశకు, అవకాశానికి తావే లేదు.(విడాకుల ద్వారా వారేదైన క్షమించరాని పాపం చేసివుంటే, వారు పునర్వివాహం చేసికొనకూడదు లేక సమాధానం పడాలని చెప్పడంలో అర్థం లేదని స్పష్టం అవుతోంది).

విడాకులు తీసుకొన్న విశ్వాసులు ఎల్లప్పుడూ పౌలు సూచనకు విధేయులు కారని పౌలుకు తెలుసని మీరనుకొంటున్నారా? నేను ఆవిధంగా అనుకుంటున్నాను. నిజమైన విశ్వాసులు తన మొదటి సూచనను అనుసరించి విడాకులు తీసుకొనరని ఆయన నమ్మకం. అందుకనే ఆయన విడాకులు పొందిన విశ్వాసులకు మళ్ళీ ఎలాంటి సూచన చేయలేదు. అయినా చాలా అరుదైన సందర్భాలలో ఒకవేళ విశ్వాసులైన వారు విడాకులు తీసుకొంటే అప్పుడు ఆయన రెండో సూచన అవసరముంటుంది. క్రీస్తుకు నిజమైన అనుచరులై, ఒకవేళ వారి కేమైనా వైవాహిక జీవితంలో సమస్యలుంటే వాటిని పరిష్కరించుకొని వారి వైవాహిక జీవితాన్ని కాపాడుకుంటారు. అలాగాక విశ్వాసులైన వారిలో ఒకరు విడాకులు తీసుకొనకుండా వుండడానికి తన ప్రయత్నాలన్నీ చేసిన తర్వాత ఒకవేళ విడాకులు ఆపలేకపోతే, ఆ విశ్వాసి తన వ్యక్తిగత అవమాన భారం తోను, క్రీస్తు చెప్పిన ఆదేశాన్ని గౌరవించాలన్న కోర్కెతో పునర్వివాహం చేసుకొనకుండా వుంటాడు. వారిలో మళ్ళీ సమాధానం కలుగుతుందన్న ఆశతో ఎదురుచూస్తుంటారు. నేటి ఆధునిక సంఘంలో విడాకులు విషయంలో విడాకులకు నిజమైన సమస్యకు కారణం ఎక్కువ మంది అసత్య విశ్వాసులున్నారు. వారు క్రీస్తును నిజంగా నమ్మి,

ఆయనకు విధేయులు కానివారని నాకనిపిస్తుంది.

1 కొరింథీ 7వ అధ్యాయాన్ని బట్టి అవిశ్వాసులకంటే విశ్వాసులను గూర్చి తమలో పరిశుద్ధాత్మ గలవారిని గూర్చి దేవునికి ఉన్నతమైన ఆశలున్నాయని పౌలు మాటలు స్పష్టం చేస్తున్నాయి. దంపతులలో అవిశ్వాసియైన వ్యక్తి విశ్వాసియైన తన జీవితభాగాస్వామితో కలసి జీవించాలనుకొంటున్నంత కాలం విశ్వాసియైన భార్య, లేక భర్త విడాకులు ఇవ్వకూడదని పౌలు వ్రాసిన మాటలు మనం చదువుతున్నాం. ఈ సూచన ఈ అంశం మీద మనం చదివిన లేఖన భాగాలన్నింటిలోను ఏకీభావం పరిపూర్ణంగా వుంది గనుక ఈ మాటలు మనకు ఆశ్చర్యాన్ని కలిగించవు. విడాకులకు దేవుడు వ్యతిరేకి. అయినా అవిశ్వాసియైన వ్యక్తి విడాకులివ్వాలనుకుంటే విశ్వాసి దాన్ని అంగీకరించాలని పౌలు సూచిస్తున్నాడు. అవిశ్వాసి దేవునికి లొంగడు గనుక, అతడు విశ్వాసిలా వ్యవహరించాలని పౌలు ఎదురుచూడడు. ఒక అవిశ్వాసి ఒక విశ్వాసితో కలిసి జీవించడానికి ఒప్పుకొన్నప్పుడు అది అవిశ్వాసి సువార్తను వినాలన్న ఆసక్తికి నిదర్శనం, లేక విశ్వాసి తన విశ్వాసంలో వెనుకంజ వేయడమైనా అయివుండాలి అని నా అభిప్రాయం.

ఒక అవిశ్వాసి నుండి విడాకులు పొందిన విశ్వాసికి పునర్వివాహం చేసికొనకూడదని ఎవరు చెప్పగలరు? విడాకులు పొందిన విశ్వాసులు పునర్వివాహం చేసుకొన వచ్చని పౌలు వీరి విషయంలో పునర్వివాహం చేసుకొనకూడదని పౌలు ఎన్నటికీ చెప్పడు. అవిశ్వాసి వలన విడాకులు పొందిన విశ్వాసి మళ్ళీ చేసుకొనడంలో దేవుడు ఎందుకు వ్యతిరేకో మనకు ఆశ్చర్యం కలుగుతుంది. దాని వలన ప్రయోజనమేమిటి? అయినా అలా అనుమతిస్తే అది పునర్వివాహాన్ని గూర్చి "విడనాడబడిన దానిని పెండ్లాడు వాడు వ్యభిచరించుచున్నాడు" అని యేసు చెప్పిన దానికి వ్యతిరేకమవుతుంది (మత్తయి 5:32), దీని విషయంలో యేసు చెప్పినదానికి మనం తప్పుగా వివరిస్తున్నామేమోనని నాకనిపిస్తోంది.

## సమస్య

విడాకుల విషయంలో ఒకరికి, లేక ఇద్దరికీ సంబంధం వున్నా అది వారికి పాపం అనడంలో యేసు, మోషే, పౌలు స్పష్టంగా ఏకీభవించారు. విడాకుల విషయములో వీరు ముగ్గురు వ్యతిరేకులే. అయితే పునర్వివాహాన్ని గూర్చి మోషే, పౌలు చెప్పిన దానికి, యేసు చెప్పిన దానికి మనమెలా సమాధానపడాలనేది మన సమస్య. వారు ముగ్గురు దేవుని నుండి ప్రేరణపొందే చెప్పారు గనుక ఆ మూడింటికి ఏకీభావం వుందని మనం తెలుసుకోవాలి.

అసలు యేసు ఎవరికి ఏమని చెబుతున్నాడో ముందు పరిశీలించి చూద్దాం. మత్తయి సువార్తలో యేసు - ఒకసారి పర్వత ప్రసంగంలోను, మరోసారి పరిసయ్యులు ప్రశ్నించి నప్పుడు విడాకులు, వివాహాన్ని గూర్చి మాట్లాడాడు. యేసు పరిసయ్యులతో చేసిన సంభాషణతో మనం ప్రారంభిద్దాం:

పరిసయ్యులు ఆయనను శోధింపవలెనని ఆయనయొద్దకు వచ్చి- ఏ హేతువుచేతనైనను పురుషుడు తన భార్యను విడనాడుట న్యాయమా? అని అడుగగా, ఆయన -సృజించిన వాడు ఆదినుండి వారిని పురుషునిగాను స్త్రీని గాను సృజించెననియు ఇందు

నిమిత్తము పురుషుడు తల్లిదండ్రులను విడిచి తన భార్యను హత్తుకొనును, వారిద్దరును ఏకశరీరముగా ఉందురని చెప్పెననియు మీరు చదువలేదా? కాబట్టి వారికను ఇద్దరుకాక ఏకశరీరముగా ఉన్నారు గనుక దేవుడు జతపరచిన వారిని మనుష్యుడు వేరుపరచకూడదని చెప్పెను. అందుకు వారు, అలాగైతే పరిత్యాగ పత్రికనిచ్చి ఆమెను విడనాడుమని మోషే యెందుకు ఆజ్ఞాపించెనని వారాయనను అడుగగా, ఆయన, మీ హృదయ కాఠిన్యమును బట్టి మీ భార్యలను విడనాడ మోషే సెలవిచ్చెను, గాని ఆదినుండి అలాగు జరుగలేదు. మరియు వ్యభిచారము నిమిత్తమే తప్ప తన భార్యను విడనాడి మరియొకతెను పెండ్లిచేసికొనువాడు వ్యభిచారము చేయుచున్నాడనియు, విడనాడబడిన దానిని పెండ్లిచేసుకొనువాడు వ్యభిచారము చేయుచున్నాడనియు మీతో చెప్పుచున్నానని వారితో ననెను (మత్తయి 19:3-9)

పరిసయ్యులు యేసుతో చేసిన సంభాషణలో వారు మోషే ధర్మశాస్త్రాన్ని గురించి ప్రస్తావించారు. అది ద్వితీ 24:1-4లోనిదని నేనిప్పటికే చెప్పాను. అక్కడేమని వుందంటే-“ఒకడు స్త్రీని పరిగ్రహించి ఆమెను పెండ్లిచేసి కొనిన తర్వాత ఆమె యందు మానభంగ సూచన ఏదో ఒకటి అతనికి కనబడినందున ఆమె మీద అతనికి ఇష్టము తప్పిన యెడల, అతడు ఆమెకు పరిత్యాగ పత్రిక వ్రాయించి ఆమె చేతికిచ్చి తన యింటి నుండి ఆమెను పంపివేయవలెను” (ద్వితీ 24:1).

యేసుకాలంలో “సిగ్గుమాలిన తనం” అంటే నిర్వచనాన్ని రెండు విధాలుగా చెప్పే రెండు వర్గాల వారున్నారు. అప్పటికి ఇరవై సం॥లు పూర్వం ఒక బోధకుడైన (రబ్బీ) హిల్లేలు, సిగ్గుమాలిన తనం అంటే సమాధానపడటానికి వీలులేని విభేదం అని నిర్వచనం చెప్పాడు. పరిసయ్యులతో యేసు సంభాషిస్తున్న సమయానికి హిల్లేలు నిర్వచనం మరింత స్వేచ్ఛను పొంది, “ఏకారణం చేతనైనా విడాకులకు అనుమతించవచ్చు అన్న సాంప్రదాయం అమలులో వుందని పరిసయ్యులు యేసును అడిగిన ప్రశ్న సూచిస్తుంది. అంటే భార్య కూరలు మాడ్చి వేసినా, తన అత్తను గురించి నిర్దయగా మాట్లాడినా, సంతానం లేనిదైనా, భర్త భార్యను విడనాడవచ్చు. అంతేగాక భర్తకు భార్యా కంటే మరో స్త్రీ ఆకర్షణీయంగా కనిపిస్తే భార్య “సిగ్గుమాలినదని” భర్త ఆమెపై నేరం మోపి ఆమెకు విడాకులు యివ్వవచ్చునని అప్పుడు అనుసరిస్తున్నారు.

హిల్లేలుకు ముందు నివసించిన షమ్మాయి అనే రబ్బీ నిర్వచనంలో “సిగ్గుమాలినతనం” అంటే అనైతికమైన పని, వ్యభిచారంవంటిది మాత్రమే అని చెప్పాడు. యేసు కాలంలో షమ్మాయి నిర్వచనం కంటే హిల్లేలు నిర్వచనం బాగా ప్రసిద్ధిలో వుంది. కనుక ఏ కారణం చేతనైన విడాకులు న్యాయసమ్మతమే అని నమ్మి, దాన్నే బోధిస్తూ జీవిస్తున్నారు పరిసయ్యులు. వారి కాలంలో విడాకులు ప్రబలంగా వున్నాయి. కాగా ఆ పరిసయ్యులు తమ పద్ధతికి ప్రాధాన్యతను యిస్తూ భార్యను విడనాడినప్పుడు, “మోషే ధర్మశాస్త్రాన్ని భంగపరచకుండా” ఆమెకు పరిత్యాగ పత్రిక వ్రాయించి యివ్వాలిగదా అని ధర్మశాస్త్రానికి ప్రాధాన్యతను యిచ్చినట్టు యేసును ప్రశ్నించారు.

## యేసు పరిసయ్యులతో మాట్లాడుతున్నాడన్న సంగతి మరచిపోవద్దు

ఈ నేపథ్యాన్ని మనస్సులో వుంచుకొన్నప్పుడు యేసు దేనికి వ్యతిరేకో బాగా అర్థం చేసుకోగలం. యేసు ముందున్న వేషధారులైన మతబోధకులలో అందరూ కాకపోయినా, ఎక్కువమంది తమ భార్యలకంటే అందమైన వారిని చూసి తమ భార్యల్లో ఒకరిద్దరికి విడాకులు యిచ్చిన వారున్నారు (తన కొండమీది ప్రసంగంలో విడాకులను గూర్చి చెబుతూ యేసు కామం ఒక వ్యభిచారం వంటిదని సూటిగా హెచ్చరించడం ఏదో సందర్భోచితంగా చెప్పిన మాట కాదని నా నమ్మకం). అయినా తాము చేసింది న్యాయమేనని వారు తమను సమర్థించుకొంటూ మోషే ధర్మశాస్త్రమును అనుసరిస్తున్నామని చెప్పుకుంటున్నారు.

వారి ప్రశ్నే వారి పక్షపాత బుద్ధిని బయల్పరుస్తూవుంది. ఏ కారణంచేతనైనా తమ భార్యలకు విడాకులు ఇవ్వవచ్చునని వారు స్పష్టంగా నమ్ముతున్నారు. అందుకు యేసు దేవుని ఆజ్ఞను వారెంత తప్పుగా అర్థం చేసుకొన్నారో బయటపెడుతూ, వివాహాన్ని గూర్చిన దేవుని ఉద్దేశ్యమేమిటో ఆదికాండం 2వ అధ్యాయంలోని మోషే మాటలను చెబుతూ వివరించాడు. “ఏకారణం చేతనైనా” విడాకులు ఇవ్వవచ్చని దేవుడెప్పుడూ ఉద్దేశించలేదు. అయినా ఇశ్రాయేలు నాయకులు, యువకులు చంచలమై సిద్ధాంతాన్ని భంగపరచినట్లు వారి నాయకులు కూడా వారి భార్యలను విడనాడుతున్నారు.

విడాకులను గూర్చి యేసు తన అభిప్రాయాన్ని బహిరంగంగా ప్రకటించకముందే ఆయన ఉద్దేశ్యమేమిటో తెలిసిన పరిసయ్యులు ప్రతి వాదానికి ముందే సిద్ధపడి వున్నారు. కనుకనే “అలాగైతే పరిత్యాగ పత్రికనిచ్చి ఆమెను విడనాడుమని మోషే ఎందుకు ఆజ్ఞాపించెనని వారాయనను అడిగిరి” (మత్తయి 19:7).

ఈ ప్రశ్న కూడా వారి పక్షపాత బుద్ధిని బయల్పరుస్తున్నది. వారు అడగడంలో తమ “భార్యలలో సిగ్గుమాలిన తనాన్ని” వారు గమనించినప్పుడు సరైన పరిత్యాగ పత్రికనిచ్చి వారికి విడాకులు యివ్వాలని మోషే ఆజ్ఞాపిస్తున్నట్టుగా వారా మాటలు చెప్పారు. కాని ద్వితీ 24:1-4లో మోషే అలా చెప్పినట్లు చదవం. అక్కడ మోషే స్త్రీ మూడవసారి వివాహంలో, ఆమె మొదటి భర్తను పునర్వివాహం చేసుకొన కూడదని కట్టడ చేస్తున్నాడు.

ఏదైన ఒక కారణం ఉంటేనే విడాకులు అనుమతి అని మోషే చెప్పాడు. అయితే యేసు మాటల్లో ఆయన వాడిన క్రియా పదాన్ని గమనించండి-పరిసయ్యులు మోషే **ఆజ్ఞాపించెను** అని చెప్పగా, యేసు మోషే **సెలవిచ్చెను** అని అన్నాడు. విడాకులను మోషే **సెలవిచ్చాడు**, కాని దానిని ఆయన **ఆజ్ఞాపించలేదు**. అంటే ప్రజల పాపానికి దయాపూర్వకమైన మినహాయింపుగా దేవుడు విడాకులకు అనుమతించాడు. దంపతులు వారి భాగస్వాముల విషయంలో అపనమ్మకంగా ఉంటారని దేవునికి తెలుసు. వారిలో అవినీతి ఉంటుందనీ ఆయనకు తెలుసు. వారివి భగ్నహృదయాలనీ ఆయనకు తెలుసు. కనుక ఆయన విడాకులకు సెలవిచ్చాడు. కాని ఆయన దానిని అసలు ఉద్దేశించలేదు. కాని పాపం విడాకుల అవసరాన్ని కలిగించింది.

తర్వాత యేసు మోషే ఉద్దేశ్యంలో “సిగ్గుమాలిన తనానికి” నిర్వచనం చెబుతూ

దేవుని ధర్మశాస్త్రం ఏమిటో పరిసయ్యులకు ఇలా వివరించి చెప్పాడు: “వ్యభిచారము నిమిత్తమే తప్ప తన భార్యను విడనాడి మరియొకతెను పెండ్లి చేసుకొను వాడు వ్యభిచారము చేయుచున్నాడు” (మత్తయి 19:9). దేవుని దృష్టిలో ఒకవ్యక్తి తన భార్యను విడనాడటంలో ఏకైక కారణం **అవినీతి** ఒక్కటే, అది నేను అర్థం చేసుకోగలను. ఇంతకంటే భర్త తన భార్యపట్ల, భార్య తన భర్తపట్ల చేయగల నేరం యింకేముంటుంది? భార్య గాని, భర్త గాని వ్యభిచారం చేసినప్పుడు, లేక మరొకరితో సంబంధాన్ని పెట్టుకొన్నప్పుడు వారు మృగప్రాయమైన సందేశాన్నిస్తారు. “అవినీతి” అన్న పదాన్ని వాడటంలో ఆయన కేవలం వ్యభిచారాన్ని గూర్చే వివరించలేదు. మరొకరి భాగస్వామిని మోహంతో ముద్దుపెట్టుకోవడం, ముద్దాడటం కూడ అవినీతికి చెందిన నేరాలే. అవి అక్రమ విధానాలు. తన పర్వత ప్రసంగంలో కామపుకోర్కె వ్యభిచారమే అని చెప్పాడు యేసు.

ఏ కారణంచేతనైనా తమ భార్యలకు విడాకులిచ్చి వెంటనే పునర్వివాహం చేసుకొన వచ్చునని ఆచరిస్తూ, చెబుతున్న పరిసయ్యులతో యేసు మాట్లాడుతున్నాడన్న సంగతి మరచిపోకూడదు. కాని ఎప్పటికీ వ్యభిచరించ కూడదు అని దేవుడిచ్చిన ఏడవ ఆజ్ఞను మీరిన వారు పరిసయ్యులు. వారు తమను తాము బుద్ధిహీనులుగా చేసుకొంటున్నారని యేసు వారితో చెప్పాడు. వారు చేస్తున్న దానికి, వ్యభిచారానికి భేదమేమీ లేదు. మరోస్త్రీని వివాహమాడాలన్న కోర్కెతో తన భార్యకు విడాకులిచ్చిన వాడు వ్యభిచారి ఏం చేస్తాడో దాన్నే చేస్తున్నాడని నిజాయితీగల వారెవరైనా చెప్పగలరు.

## పరిష్కారం

యేసు చెప్పినదానిని, మోషే, పౌలు చెప్పినదానితో సమన్వయపరచడానికి ఇది మూలం. యేసు పరిసయ్యుల వేషధారణను బయలుపరుస్తున్నాడు. పునర్వివాహాన్ని నిషేధించిన ఏ ధర్మశాస్త్రాన్ని ఆయన కించపరచలేదు. ఒకవేళ ఆయన అలాచేసివుంటే, ఆయన మోషేను,పౌలును వ్యతిరేకించి విడాకులిచ్చిన లక్షలాది మందిలో, పునర్వివాహం చేసుకొన్న లక్షలాది మందిలో గందరగోళాన్ని రేపి వారిని కలవరపరిచేవాడు. ఒకవేళ యేసు పునర్వివాహాన్ని రద్దు చేశాడంటే ఆయన ధర్మశాస్త్రాన్ని చెప్పడం వినకముందు విడాకులు తీసుకున్న వారికి, పునర్వివాహం చేసుకొన్న వారికి గూర్చి మనం ఏం చెప్పాలి? బైబిలు తెలుసుకొనికూడ వ్యభిచారులు దేవుని రాజ్యాన్ని స్వతంత్రించుకొనరు, వారు వ్యభిచార సంబంధాలతో జీవిస్తున్నారు అని చెప్పాలా? (1కొరింథీ 6:9-10). మళ్ళీ విడాకులివ్వండి అని చెప్పాలా? ***కాని దేవుడు విడాకులను ద్వేషించడం లేదని చెప్పాలా?***

పునర్వివాహం చేసుకొన్నవారు క్రమంగా వ్యభిచరించకుండా వుండేందుకు వారి మొదటి భాగస్వామి చనిపోయేంత వరకు యిప్పుడు తమతో ఉన్నవారితో శారీరక సంబంధం లేకుండా ఉండమని మనం చెప్పాలా? ***వివాహం చేసుకొన్నవారు శారీరక సంబంధం లేకుండా ఉండమని పౌలు చెప్పలేదా?*** అలాంటి సిఫారసు శారీరక సంబంధమైన శోధనకు దారి తీయదా, అంతేగాక మొదటి భాగస్వామి చనిపోవాలని కోరుకొనేటట్లు చేయదా?

అలాంటి వారితో యిప్పుడున్న భాగస్వాములకు విడాకులిచ్చి పాత వారిని మళ్లీ పెండ్లి చేసుకోమని చెప్పాలా? అలా అయితే ద్వితీ 24:1-4లో మోషే చెప్పిన ధర్మశాస్త్రం దాన్ని నిషేధిస్తోంది గదా?

విడాకులు తీసుకొని పునర్వివాహం చేసుకొనకుండా వున్న వారి సంగతేమిటి? వారిని ఒకవేళ పునర్వివాహానికి అనుమతిస్తే, వారి మొదటి భాగస్వామి ఒకవేళ ఏదైనా అవినీతి కార్యం చేస్తే అవినీతి కార్యం జరిగిందని నిర్ణయించేందుకు తామే కారణమని ఆ తప్పును తమ మీద ఎవరు వేసుకొంటారు? వారు పునర్వివాహం చేసుకోవాలంటే, వారి మొదటి భాగస్వామి కామోద్రేకంతో నేరం చేశారని నిరూపించడానికి కొందరు అవసరం గదా. అందుకు వారిలో వేరొకరు దాన్ని నిరూపించడానికి కొందరు సాక్షులను తీసుకురావాలి గదా?

నేనింతకు ముందు చెప్పినటట్లు ఒకరు శారీరక సంబంధాన్ని మానివేసినందున మరొకరు వ్యభిచార నేరం చేశారు గనుక పునర్వివాహం చేసుకొన్న వారి సంగతేమిటి? అలాంటి వారితో శారీరక సంబంధం మానివేసిన వారికి పునర్వివాహం చేసుకోవడానికి అనుమతినిచ్చి, ఆ కారణంగా వ్యభిచారం చేసిన వారిని అనుమతించకపోవడం న్యాయమా?

వివాహానికి ముందే వ్యభిచారం చేసిన వ్యక్తి సంగతేమిటి? వారి వ్యభిచారం, ముందు కాలంలో కాబోయే భాగస్వామి పట్ల అపనమ్మకం కాదా? ఆ వ్యక్తి పాపం చేసినప్పుడు వారిలో ఒకరు వివాహమైన వారైవుంటే అది వ్యభిచారానికి సమానమైనది కాదా? అలాంటి వ్యక్తి, వివాహం చేసుకోడానికి అనుమతి నెందుకుయిచ్చారు?

వివాహం కాకుండా ఇద్దరు కలసి జీవించిన వారి సంగతేమిటి? వారిలో ఎవరు విడిపోవాలి? వారు అధికారపూర్వకంగా వివాహం చేసుకోలేదు కనుక వారు విడనాడిపోయిన తర్వాత మరొకరిని వివాహం చేసుకోడానికి వారికెందుకు అనుమతి నిచ్చారు? వారు విడాకులు పొంది, పునర్వివాహం చేసుకొన్న వారికంటే భిన్నమైన వారెలా అవుతారు?

ఒకవ్యక్తి క్రైస్తవుడైనప్పుడు, "పాతవి గతించెను. ఇదిగో కొత్తవాయెను" అన్న సత్యం సంగతి ఏమిటి? (2 కొరింథీ 5:17) అన్యాయమైన విడాలకు తప్ప మిగతా పాపాలన్నీ పోయినట్లేనా?

యేసు పునర్వివాహాన్ని గూర్చి మరో నూతన ధర్మశాస్త్రాన్ని స్థాపించడంలేదని ఆలోచించడానికి బలమైన కారణాలుగా ఈ ప్రశ్నలు,[55] ఇంకా అనేకమైన ప్రశ్నలు అడగవచ్చు. పునర్వివాహంపై తన నూతన ధర్మశాస్త్రం, అనేక శాఖలు వేస్తుందని యేసు ముందుగానే భావించాడు. అందుకనే ఆయన మాటల్లోనే ఆయన పరిసయ్యుల వేషధారణను అనగా కామోద్రేకాలు, మత విషయాలు, ఏ కారణంచేతనైనా పునర్వివాహం కోసం తమ భార్యలను

[55] ఉదాహరణకు, విడాకులు తీసుకున్న ఒక సంఘకాపరి తాను తిరిగి పెళ్ళి చేసుకొన్న పిదప సంఘం అతన్ని వెలివేయటం చూసి, ఇలా అంటున్నాడు, "నాభార్యకు విడాకులు ఇచ్చే బదులు ఆమెను చంపివుంటే బాగుండేది. ఒకవేళ ఆమెను నేను హత్యచేసి ఉనింటే, పశ్చాత్తాపడేవాణ్ని, అప్పుడు క్షమాపణ పొందుకొని తిరిగి వివాహమాడి, నా పరిచర్యలో కొనసాగి వుండేవాణ్ని" అని అనుకున్నాడు.

విడనాడే వేషధారులను ఆయన బయటపెట్టాడు.

వారు చేస్తున్నది తప్పు అని చెప్పడానికి బదులు వారు "వ్యభిచారం చేస్తున్నారు" అని ఎందుకు చెప్పాడంటే ఏ కారణం చేతనైనా విడాకులివ్వడం, ఆ తర్వాత పునర్వివాహం చేసుకోవడానికి, వ్యభిచారం చేసిన దానికి ఏ బేధం లేదని వారు తెలుసుకొని, వారు మళ్ళీ ఆపని ఎప్పటికీ చేయకుండా వుండాలని యేసు అంత కఠినంగా చెప్పాడు. పునర్వివాహంలో శారీరక సంబంధాన్ని గూర్చే యేసు చెబుతున్నాడు. శారీరకయిష్టాలను విడిచి పెట్టినంత కాలం ఆయన పునర్వివాహాన్ని అనుమతిస్తాడని మనం చెప్పుకోవచ్చా? లేదు. కనుక ఆయన ఎప్పుడూ ఉద్దేశించని దానిని ఆయన చెప్పాడని చెప్పకూడదు.

## ఒక ఆలోచింపదగిన పోలిక

ఇద్దరు వ్యక్తులను గూర్చి పరిశీలిద్దాం. వారిలో ఒకరు వివాహితుడు, మతాభిమాని,తన హృదయపూర్వకంగా దేవుని ప్రేమిస్తున్నానని చెబుతాడు. కాని తన పక్కింటిలో వున్న యవ్వనస్తురాలి పట్ల వ్యామోహంతో ఆమెతో సంబంధం పెట్టుకోవాలనుకొన్నాడు. అలా అనుకోవడమే తడువుగా తన భార్యకు విడాకులిచ్చాడు. వెంటనే తన కలలోని యవ్వనస్థురాలిని పెళ్ళి చేసుకొన్నాడు.

రెండోవ్యక్తి అంత భక్తిపరుడు ఏమీ కాదు. దాని మీద నమ్మకం లేనివాడు. అతను సువార్తను ఎప్పుడూ వినలేదు. పాపపు జీవన విధానంలో కొనసాగుతున్నాడు. దాని ఫలితంగా ఎవరూ పెండ్లి చేసుకోవటానికి ఇష్టపడలేదు. ఒంటరిగా కొన్నేళ్ళు గడిపాడు. అప్పుడు సువార్తను విని మారుమనస్సు పొందాడు. తన హృదయపూర్వకంగా యేసును అనుసరించటం మొదలుపెట్టాడు. అలా మూడు సంవత్సరాలు గడిచాయి తాను హాజరవుతున్న సంఘంలోనే సమర్పణాజీవితం గల ఒక స్త్రీ తో పరిచయమైంది. వారిద్దరూ ప్రభువును శ్రద్ధతో వెదికేవారు. ఇతరుల సలహాలను వినేవారు. తర్వాత వారిద్దరూ వివాహం చేసుకొన్నారు. ఒకరికొకరు నమ్మకంగా వుండి జీవితాంతం కలసి దేవుని సేవించారు.

పై ఇద్దరూ పురుషులు పునర్వివాహం చేసుకొని పాపం చేశారు. వారిద్దరిలో ఎవరిది ఎక్కువ పాపం? మొదటి వానిదే ఎక్కువ పాపమని స్పష్టంగా తెలుస్తోంది. ఎందుకంటే అతడొక వ్యభిచారి వంటివాడు అనడంలో సందేహం లేదు.

అయితే రెండవ వాని సంగతేమిటి? అతడు పాపం చేసినట్లుగా కనబడుతోందా? వ్యభిచారి అని మొదటివాడిని అన్నట్లు రెండోవాడు కూడా వ్యభిచారికంటే **భిన్నమైన** వాడు కాడు అనగలమా? అలా అతనిని అనలేమని అనుకొంటున్నాను. విడాకులిచ్చి పునర్వివాహం చేసుకొన్న వారిని గూర్చి యేసు వ్యభిచరిస్తున్నారని చెప్పాడు గనుక యిప్పుడు తనతో వున్న స్త్రీని దేవుడు జతపరచలేదు గనుక, అతడు అతని మొదటి భార్యను వివాహం చేసుకొన్నాడని దేవుడు ఎంచుతున్నాడని, వ్యభిచారంలో జీవిస్తున్నాడని అతనితో చెప్పాలా?

ఈ ప్రశ్నకు జవాబులు స్పష్టంగానే వున్నాయి. తమ భాగస్వామిపై గాక యితరులపై కామ దృష్టిగల వారు వ్యభిచారం చేసినట్టే. అలాగే తన భాగస్వామి కంటే మరింత ఆకర్షణీయంగా

కనిపించిందని తన భాగస్వామికి విడాకులివ్వడం వ్యభిచారంతో సమానం. కాని అవివాహితుడైన వ్యక్తికి భాగస్వామి లేరు గనుక వారితో అపనమ్మకంగా వుండి వ్యభిచారం చేయలేడు. అలాగే విడాకులు పొందిన వ్యక్తికి భాగస్వామిలేదు గనుక అపనమ్మకంగా వుండి వ్యభిచారం చేసే అవకాశం లేదు. బైబిలు చరిత్రకు సంబంధించి యేసు చెప్పిన దానిని మనం ఒకసారి అర్థం చేసుకొన్న తర్వాత అర్థం లేని అభిప్రాయాలకు రావడం, ఇతర బైబిలు భాగంతో వ్యతిరేకించడంలో అర్థం లేదు.

అలాగే పరిసయ్యులకు యేసు చెప్పిన జవాబు విన్న ఆయన శిష్యులు, "భార్యభర్తల కుండు సంబంధము ఇట్టిదైతే పెండ్లి చేసుకొనుట యుక్తము కాదని ఆయనతో చెప్పిరి" (మత్తయి 19:10). ఆ శిష్యులు పరిసయ్యుల బోధలోను, వారి ప్రభావంలోను పరిసయ్యుల ప్రభావం బాగా వున్న సంస్కృతిలో పెరిగిన వారు. వైవాహిక జీవితం అంత శాశ్వతమైనదని వారెప్పుడూ ఆలోచించ లేదు. వాస్తవానికి అప్పటికి, యేసు పరిసయ్యులతో ఆ జవాబు చెప్పేంతవరకు, ఏ కారణంచేతనైనా పురుషుడు తన భార్యకు విడాకులివ్వడం న్యాయసమ్మతమే అని నమ్మినవారు. కనుక విడాకులు, వ్యభిచారం అనే పాపం చేయడం కంటే అసలు వివాహం చేసుకొనకుండా ఉండడం ఉత్తమమన్న నిర్ణయానికి వచ్చారు.

అందుకు యేసు,

> అనుగ్రహము నొందినవారు తప్ప మరి ఎవరును ఈ మాటను అంగీకరింపనేరరు. తల్లిగర్భమునుండి నపుంసకులుగా పుట్టినవారు గలరు, మనుష్యులవలన నపుంసకులుగా చేయబడిన నపుంకులును గలరు, పరలోకరాజ్యము నిమిత్తము తమ్మును తామే నపుంసకులనుగా చేసికొనిన నపుంసకులును గలరు (మత్తయి 19:11-12).

అంటే ఒకవ్యక్తి తన మోహపు తలంపును అదుపు చేసుకొనటమే అతడు తనను అదుపు చేసుకొనే సమర్థత అవుతుంది. పౌలుకూడా, "అయితే మనస్సు నిలుపలేని యెడల పెండ్లి చేసుకొన వచ్చును. కామతప్తులగుట కంటే పెండ్లి చేసికొనుట మేలు" అని చెప్పాడు (1కొరింథీ 7:9). పుట్టుకతోనే నపుంసకులుగా పుట్టినవారికి, లేక మనుష్యుల వలన నపుంసకులుగా చేయబడిన నపుంసకులకు (ఆనాటి పురుషులు తమ అంత:పుర స్త్రీలను చూచుకొనుటకు తమకు నమ్మకం కలిగిన పురుషులను నపుంసకులుగా చేసెడివారు) కామపు కోర్కె వుండదు. "పరలోక రాజ్యము నిమిత్తము తమ్మును తామే నపుంసకులనుగా చేసికొనిన నపుసంకులు తమను అదుఎత్తు చేసుకొనే దేవుని అదనపు వరాన్ని పొందిన వారుతప్ప మరి ఎవరును ఈ మాటను అంగీకరింపనేరరు" (మత్తయి 19:11).

## కొండమీది ప్రసంగం

యేసు కొండ మీది ప్రసంగాన్ని విన్న ఇశ్రాయేలీయులలో వేషధారులైన బోధకులు, నాయకులైన పరిసయ్యుల ప్రభావంతో జీవిస్తున్న వారునన్నారన్న సంగతి మన మనస్సులో వుంచుకొని ఈ అంశాలను పరిశీలించాలి. మనం యింతకు ముందు కొండ మీది ప్రసంగాన్ని

అధ్యాయనం చేసినప్పుడు యేసు పరిసయ్యుల అసత్య బోధను సరిదిద్దడానికే ఆ ప్రసంగం చేశాడని తెలుసుకొన్నాం. శాస్త్రులు, పరిసయ్యుల నీతికంటె ఎక్కువ నీతిమంతులు కాకుంటే వారు పరలోక రాజ్యంలో ప్రవేశించలేరని ఆ జనసమూహంతో యేసు చెప్పాడు (మత్తయి 5:20 చూడండి). అంటే శాస్త్రులు, పరిసయ్యులు నరకానికి వెళ్తారని దాన భావం. యేసు తన ప్రసంగం ముగించినప్పుడు ఆయన "వారి శాస్త్రులు వలె బోధించనందుకు" జనసమూహాలు ఆశ్చర్యపడ్డారు (మత్తయి 7:29).

యేసు మొదట తన ప్రసంగంలో తాము ఎప్పుడూ వ్యభిచారం చేయలేదని చెబుతూ, తమ కామపు తలంపులతో దానిని తీర్చుకోవడానికి భార్యలకు విడాకులిచ్చి, పునర్వివాహం చేసుకొనే వారి శేషధారణను గూర్చి విమర్శించాడు. ఇతరులను పునర్వివాహం చేసుకోవాలను కొన్న వారి కోర్కెలోని శారీరక పాపం కంటే మానసికమైన పాపం ఎంతో ప్రమాదకరమైనదని ఆయన వివరించాడు. దీని గూర్చి కొంచెం ఆలోచించగల నిజాయితీవున్న వ్యక్తి దీన్ని యిదెంత ప్రమాదకరమైనదో అర్థం చేసుకోగలడని ఆయన ఈ మాట చెప్పాడు. యేసు ప్రసంగం చేసేంత వరకు జన సమూహంలోని అధిక సంఖ్యాకులు, "ఏ కారణం చేతనైనా" విడాకులివ్వడం న్యాయసమ్మతమే అని భావిస్తు వున్నారు. ఆదినుండి కూడా దేవునిది అత్యున్నత ప్రమాణమని తన శిష్యులు, ఇతరులు కూడా తెలుసుకోవాలని యేసు ఉద్దేశ్యం.

> వ్యభిచారము చేయవద్దని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా, నేను మీతో చెప్పునదేమనగా-ఒక స్త్రీని మోహపుచూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును. నీ కుడికన్ను నిన్ను అభ్యంతర పరచినయెడల దాని పెరికి నీయొద్దనుండి పారవేయుము. నీ దేహమంతయు పరకములో పడవేయబడకుండ నీ అవయవములలో నొకటి నశించుట నీకు ప్రయోజనకరముగదా. నీ కుడిచెయ్యి నిన్నభ్యంతర పరచిన యెడల దాని నరికి నీయొద్ద నుండి పారవేయుము, నీ దేహమంతయు నరకములో పడకుండ నీ అవ యవములలో ఒకటి నశించుట నీకు ప్రయోజనకరము గదా. తన భార్యను విడనాడు వాడు ఆమెకు పరిత్యాగ పత్రిక యియ్యవలెనని చెప్పబడియున్నది గదా, నేను మీతో చెప్పునదేమనగా- వ్యభిచార కారణమునుబట్టి గాక, తన భార్యను విడనాడు ప్రతివాడును ఆమెను వ్యభిచారిణిగా చేయుచున్నాడు, విడనాడబడిన దానిని పెండ్లాడువాడు వ్యభిచరించు చున్నాడు (మత్తయి 5:27-32).

మొదటిగా, నేనింతకు ముందే చెప్పినట్లు- విడాకులు, పునర్వివాహాన్ని గూర్చిన యేసు మాటల్లోని కామాన్ని గూర్చిన హెచ్చరికననుసరించి అవి వ్యభిచారంకంటే తీవ్రమైన పాపమన్న భావం ఈ లేఖన భాగమంతటిలో వుంది. కనుక ఏడవ ఆజ్ఞను అనుసరించడంలోనే

వున్న తన ఈ భావాన్ని యేసు తన శిష్యులకు అర్థమయ్యేలాగా బోధించాడు. అంటే కామపుకోర్కె ఉండకూడదు, విడాకుల పత్రం వ్రాసి యివ్వకూడదు, పునర్వివాహం చేసుకొనకూడదని ఆయన మాటల అర్థం.

యూదుల సమాజమందిరములలో ఈ ఏడవ ఆజ్ఞను చదవడం యేసు శ్రోతలలోని యూదులందరు వినేవుంటారు (ఆ రోజుల్లో వ్యక్తి గతంగా బైబిళ్ళు వుండేవి కావు). వారు దాని వివరణ వినడమే గాక వారి శాస్త్రులు, పరిసయ్యులు దానిని అనుసరించిన విధానాన్ని కూడా చూసి వుంటారు. అయితే యేసు, "నేను మీతో చెప్పున దేమనగా" అని కొత్త ధర్మశాస్త్ర నియమాలను చేర్చక, వాటిని గూర్చిన దేవుని అసలైన ఉద్దేశ్యాన్ని వివరించాడు.

మొదటిది, ఆ ఆజ్ఞ కామపు కోర్కెను స్పష్టంగా నిషేధిస్తోంది. అంతేకాక ఈ ఆజ్ఞ లేకపోయినా, దేవుడు నిషేధించిన కోర్కెను తీర్చు కోవాలనుకోవడాన్ని గూర్చి ఆలోచిస్తే అది తప్పని ఎవరికైనా తెలుస్తుంది.

రెండవది, వైవాహిక జీవితాన్ని శాశ్వితమైన దానిగా దేవుడు ఉద్దేశించాడని ఆదికాండం మొదటి అధ్యాయాలు స్పష్టంగా బోధిస్తున్నాయి. అంతేగాక, విడాకులు పునర్వివాహం ఎంత వరకు సరైనదని ఆలోచించే వారికి ***మరి ముఖ్యంగా*** పునర్వివాహం చేసుకోవాలన్న ఉద్దేశ్యంతో విడాకులివ్వడం వ్యభిచారం చేసిన దానితో సమానమేనని అర్థమవుతుంది.

అయితే, తిరిగి ఈ ప్రసంగంలో కామవాంఛను గురించిన నిజాన్ని, మరియు ఏదోఒక కారణంచేత తీసుకొనే విడాకులు మరియు పునర్వివాహం గురించి నిజాలను తెలుసుకోవడానికి సహాయకరంగా యేసు ఈ ప్రసంగం చేశాడని స్పష్టమవుతోంది. అంతేకాని లేఖనాలలో పునర్వివాహాన్ని గూర్చి ఇంతకు ముందు లేని నూతన నియమాలను ఆయన చెప్పలేదు.

యేసు చెప్పినట్టు కన్ను అభ్యంతరపరిస్తే దాన్ని పెరికి పారవేసినవారు, చెయ్యి అభ్యంతరపరిస్తే దాన్ని నరికి పారవేసిన వారు సంఘంలో చాలా తక్కువ మందే వున్నారు. అసలు అలాంటి ఆలోచనలు యితర లేఖనభాగాలకు వ్యతిరేకమైనవి. ఆ మాటలు శారీరక సంబంధమైన శోధనలను తప్పించుకోవడానికి కఠినంగా చెప్పినవే, అయినా మళ్ళీ పెళ్ళి చేసికొన్న వ్యక్తి, వ్యభిచరించినట్టే అన్న యేసు మాటలను అక్షరార్థంగా వివరించడం, ఇతర లేఖ భాగాలకు పూర్తి వ్యతిరేకమైన అలా అక్షరార్థంగా వివరించే వారు సంఘాలలో చాలామంది ఉన్నారు. తన మాటలు ద్వారా సత్యాన్ని తెలుసుకొనుట వలన విడాకులిచ్చే వారు అతి తక్కువ మంది ఉండాలన్న లక్ష్యంతో యేసు ఆ మాటలు చెప్పాడు. కామము తలంపును గూర్చి తన మాటలను తన అనుచరులు హృదయ పూర్వకంగా అంగీకరిస్తే, వారిలో అవినీతి వుండదని ఆయనా మాటలు చెప్పాడు. ఎప్పుడైతే అవినీతి వుండదో అప్పుడు విడాకులకు సరైన ఆధారం వుండదు. అప్పుడు ఆది నుండి దేవుడు దేనినుద్దేశించాడో అలాగే జరుగుతుంది.

## తన భార్య వ్యభిచరించేటట్లు పురుషుడు ఎలా చేయగలడు?

"వ్యభిచార కారణమును బట్టిగాక, తన భార్యను విడనాడు ప్రతి వాడును ఆమెను

వ్యభిచారిణిగా చేయుచున్నాడు" అన్న యేసు మాటలను గమనించండి. ఈ మాటను చూస్తే పునర్వివాహాన్ని గూర్చి ఆయన క్రొత్త సిద్ధాంతం చెప్పడం లేదు. కాని సరైన కారణం లేక తన భార్యను విడనాడే వాడు "తన భార్యను వ్యభిచారిణిగా" చేస్తు ఎంత పాపం చేస్తున్నాడో అతనికి తెలియజేస్తున్నాడు. ఒక వ్యక్తి తన భార్యకు విడాకులిచ్చి నందువలన ఆమెను వ్యభిచారిణిగా చేస్తున్నాడు గనుక యేసు ఆ పునర్వివాహాన్ని నిషేధిస్తున్నాడు అని కొందరంటారు. కాని ఆ మాట సరైనది కాదు. విడాకులిచ్చుట వలన ఒక వ్యక్తి పాపం చేస్తున్నాడని నొక్కిచెప్పడమే యేసు ఉద్దేశ్యం. భర్తభార్యకు విడాకులిచ్చినందు వలన ఆమె తన భర్త స్వార్థానికి బలైపోయింది గనుక మళ్ళీ పెళ్ళి చేసుకొనడం తప్ప ఆమెకు మరొక మార్గం లేదు. కనుక ఆ పాపంలో ఆమెకు పాలు లేదు. అయిన్పటికీ దేవుని దృష్టిలో ఆమె భర్త ఆమె మళ్ళీ పెళ్ళి చేసుకోవడం తప్ప వేరే మార్గంలేని దిక్కుమాలిన దానిగా చేశాడు. అలా ఆమె మరొక పురుషుని పక్కలో పండుకొనేటట్లు ఒక విధంగా భర్త బలవంత చేసినట్లు. అయితే ఇదంతా చేసి తాను వ్యభిచారం చేయలేదని అనుకొనే వ్యక్తి, తన విషయంలోను, తన భార్య విషయంలోను రెండంతల వ్యభిచారం చేసిన నేరస్థుడవుతున్నాడు.

పురుషుని స్వార్థానికి బలైపోయిన భార్య వ్యభిచార నేరస్థురాలని యేసు చెప్పడంలేదు. అలా చెబితే అది పూర్తిగా అన్యాయం. పురుషుడు పరిత్యజించిన స్త్రీ మళ్ళీ వివాహం చేసుకొనకపోతే ఆమెను వ్యభిచారి అనడం అర్థంలేని మాట. ఆమె మళ్ళీపెండ్లి చేసుకొనకపోతే ఆమె వ్యభిచారి అని దేవుడెలా అంటాడు? పురుషుడు ఆమె పట్ల అలా చేసినందుకు అతడు వ్యభిచారని "తన భార్య" వ్యభిచారం చేసేటట్లు చేసినందుకు ఆమె పట్ల అది నిజంగా వ్యభిచార నేరం కాకపోయినా అందుకు ఆమె భర్తనే దేవుడు నేరస్థునిగా ఎంచుతాడు. ఎందుకంటే ఆమె పునర్వివాహం న్యాయసమ్మతమైనది.

"విడనాడబడిన దానిని పెండ్లాడు వాడు వ్యభిచరించు చున్నాడు" అని అన్న యేసు వివరణ సంగతేమిటి? దీనికి సరైన సమాధానానికి రెండు అవకాశాలున్నాయి.

భార్యకు విడాకులు యిచ్చి నేను వ్యభిచారం చేయలేదనుకునే వ్యక్తి వ్యభిచారం చేశాడని యేసు అతనిపై మూడో అభియోగాన్ని మోపుతున్నాడు, (ఈ నేరానికే అతనిపై రెండు నేరాలు మోపాడు). లేక ఒక వ్యక్తి తాను ఒక వివాహితను చేసుకోవాలన్న ఉద్దేశ్యంతో "తాను వ్యభిచరించ కుండేటట్లు" ఆమె తన భర్త విడాకులిచ్చేటట్లు ఆమెను ప్రోత్సహిస్తోన్న వ్యక్తిని గూర్చి యేసు చెబుతున్నాడా? ఈ లోకంలో విడాకులు తీసుకొన్న స్త్రీని వివాహం చేసుకొన్న వారెవరైన వ్యభిచారం చేసినట్లేనని ఒకవేళ యేసు ఉద్దేశ్యమైతే ఇప్పటికి కొన్ని వందల సం॥లుగా మోషే ధర్మశాస్త్ర సమ్మతితో పరిత్యజించిన స్త్రీ వివాహమాడిన ప్రతి ఇశ్రాయేలీయుడు వ్యభిచారం చేసినట్టే. యేసు ఈ మాటలు చెప్పిన రోజునే మోషే ధర్మశాస్త్ర సమ్మతిగా విడాకులు పొందిన స్త్రీని వివాహం చేసుకొన్న వ్యక్తులందరూ ఒక నిమిషానికి ముందు నేరస్థులు కాని వారు ఇప్పుడు యేసు దేవుని ధర్మ శాస్త్రాన్ని మార్చాడు గనుక వారంతా ఈ క్షణంలో నేరస్థులైనారు. అంతేగాక, పౌలు కొరింథీయులకు వ్రాసిన పత్రికలో ఈ అంశంపై చెప్పిన ప్రకారం విడాకులు

పొందిన స్త్రీని వివాహం చేసుకొనడం పాపం కాదన్న మాటను నమ్మి భావికాలంలో పునర్వివాహం చేసుకొన్న వారు పాపం చేస్తున్నట్లే, వ్యభిచారంచేస్తున్నట్లే.

విడాకులు పొందిన స్త్రీని వివాహమాడిన పురుషుని అభినందించేటట్లు బైబిల్లోని ఆత్మ నన్ను ప్రేరేపిస్తుంది. విడాకులు పొందిన స్త్రీ ఒకవేళ ఆమె మొదటి భర్త స్వార్థం వలన నిందారహితురాలైతే ఆమెను వివాహమాడి ఆమెకు ఆశ్రయం కలిగించిన వ్యక్తిని అభినందించినట్లే ఆమె భర్తను మెచ్చుకొంటాను. ఆమె మొదటి విడాకుల విషయంలో ఒకవేళ నిందితురాలై క్షమించి, ఆమె ఇక మంచిగా వుంటుందని నమ్మి ఆమె గతాన్ని మరిచిపోయి ఆమెను ఆదరించిన అతనిలోని క్రీస్తు క్షమాగుణానికి, దయకు నేనే తనని అభినందిస్తున్నాను. బైబిలును పూర్తిగా చదివిన తనలో పరిశుద్ధాత్మవున్నదని చెప్పేవ్యక్తులెవరైనా విడాకులు పొందిన స్త్రీని వివాహం చేసుకొనడాన్ని యేసు నిషేదించాడని ఎలా చెప్పగలరు? ఒకరి స్వార్థానికి బలైపోయిన వారిని ఎన్నడూ శిక్షించని యేసు న్యాయం, తన తప్పు లేకపోయినా విడాకులను పొందిన స్త్రీని శిక్షించాలనడం దేవుడు చెప్పిన న్యాయానికి అనుగుణంగా వుంటుందా? పశ్చాత్తాపం చెందిన పాపాత్ములను క్షమించి మరో అవకాశాన్ని కలిగించే సువార్తలో విడాకులు పొందిన స్త్రీ మళ్ళీ వివాహం చేసుకొనడం పాపం అనడం ఎలా పొసుగుతుంది?

## సారాంశం

విడాకుల విషయంలో భాగస్వాములైన వారిలో ఒకరు లేక ఇద్దరూ పాపం చేసినట్లే అని బైబిలు చెబుతోంది. ఎవరూ కూడా విడాకులు పొందాలని దేవుడెప్పుడూ ఉద్దేశించ లేదు. అయితే అవినీతి సంభవించినప్పుడు కనికరంతో విడాకులకు వీలు కల్పించాడు. అదే కనికరంతో ఆయన విడాకులు పొందిన వారు మళ్ళీ పెండ్లి చేసుకొనవచ్చునన్న వీలును కూడా కల్పించాడు.

ఒకవేళ బైబిలు చదవని వ్యక్తి పునర్వివాహం పాపం అని ఎప్పుడైనా అనుకుంటే (పాతనిబంధన ప్రకారం రెండు అసాధారణ పరిస్థితుల వలన గాక, కొత్తనిబంధన ప్రకారం క్రైస్తవుడై వుండి, మరో క్రైస్తవుని ద్వారా విడాకులు పొంది పెండ్లి చేసుకొంటే తప్పు) అవి యేసు చెప్పిన మాటలు కావు. అయినప్పటకి పునర్వివాహాన్ని గూర్చి యేసు చెప్పిన దానికి, ఇతర బైబిలు బోధలకు అనుగుణంగా వుండే మరో న్యాయసమ్మతమైన విధానాన్ని మనం కనుగొన్నాం. అదేమిటంటే, ప్రతి పునర్వివాహంలోనూ విడాకులు యిచ్చిన వారు పునర్వివాహం చేసుకొన్న వారు అనుసరించలేని ధర్మశాస్త్ర నియమంకంటే మరింత కఠిన నియమం వలన దేవుని యితర ఆజ్ఞలను భంగపరిచే నియమాన్ని యేసు ప్రవేశపెట్ట లేదని తెలుసుకొన్నాం. దానికంటే తమలోని వేషధారణను ప్రజలు తెలుసుకొనేటట్లు తన నియమం ద్వారా ఆయన వారికి సహాయం చేస్తున్నాడు. ఇంకా తామెప్పుడూ వ్యభిచరించలేదని నమ్మే వారు ఇతరమైన వారి కోర్కెల ద్వారా, అంటే మోహపుచూపు, కామపు కోర్కె, విడాకుల విషయంలో వారి ఉదాసీనత భావం ద్వారా వారు పాపం చేస్తున్నారని గ్రహించ గలిగేటట్లు తన ఈ నియమం ద్వారా సహాయం చేస్తున్నాడు.

పాశ్చాత్తాపం చెందిన పాపాత్ములకు క్షమాపణ గలదని బైబిలు బోధిస్తోంది. వారికి

విడాకులు పొందిన వారితో సహా రెండు మూడు అవకాశాలను యిస్తోంది. విశ్వాసి మరో విశ్వాసి వలన విడాకులు పొందడం అనేది ఎప్పుడూ జరగకూడదు. ఎందుకంటే నిజమైన విశ్వాసులు అవినీతి పనులు చేయరు. కనుక విడాకులకు న్యాయసమ్మతమైన కారణం వారిలో వుండదు. ఒక వేళ అలాంటి వారెవరైనా విశ్వాసుల్లో వుంటే వారుగాక ఇతరులు మళ్ళీ పెళ్ళి చేసుకొంటే నూతన నిబంధన ప్రకారం అది పాపం కాదు. విశ్వాసులైన వారిలో అరుదుగా యిలాంటి విడాకులు జరిగితే వారిద్దరు మళ్ళీ పెండ్లి చేసుకొనకుండా వుండాలి. లేదా ఒకరితో ఒకరు సమాధానపడాలి.

